
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 29.5
కనిష్ఠం 23.0
ANDHRAJYOTHY
నల్లగొండ
3
మంగళవారం 7 అక్టోబరు 2025



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	588 (306.1010)	53,087	56,398
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.15 (4.24)	7,137.78	6,060.91
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.342 (44.7433)	37,552	37,552

చికెన్ ధరలు | లైవ్ : రూ.130 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.230

ఆర్టీసీకి దసరా జోష్

» అదనంగా రూ.1.65కోట్ల ఆదాయం » ఆర్జనలో సూర్యాపేట డిపో తొలి స్థానంలో



ఉమ్మడి జిల్లాలో ఆర్టీసీ రీజియన్ పరిధిలోని ఏడు డిపోలకు దసరా పండుగ సెలవులు అదనపు ఆదాయాన్ని సమకూర్చాయి. రాష్ట్రంలో ప్రధాన పండుగల్లో బతుకమ్మ, దసరా కావడంతో ప్రజలు పెద్ద సంఖ్యలో పట్టణాల నుంచి స్వగ్రామాలకు ఆర్టీసీ బస్సుల్లో తరలివెళ్లారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం కావడం, ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పండుగ సందర్భంగా మహిళలు అధిక సంఖ్యలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. మహిళల ఉచిత ప్రయాణానికి ప్రభుత్వం ఆర్టీసీకి రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తోంది.
- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

దసరా సందర్భంగా హైదరాబాద్, పట్టణాల నుంచి పల్లెలకు, స్వగ్రామాలకు వెళ్లేందుకు సుమారు 15 రోజుల పాటు ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీలను నడిపింది. పండుగ రద్దీకి తగట్టు ఆర్టీసీ మొత్తం 597 ప్రత్యేక సర్వీసులు నడిపింది. ఇక సెలవులు ముగియడంతో ఆది, సోమవారాల్లో రీజియన్ పరిధిలోని అన్ని బస్టాండ్లు ప్రయాణికులతో కిటకిటలాడాయి.

రూ. 1.65కోట్లకుపైగా ఆదాయం

ఆర్టీసీ దసరా పండుగకు ప్రత్యేక బస్సులు నడపడంతో అదనంగా రూ.1,65,78,605 ఆదాయం సమకూరింది. పండుగ సెలవులు దృష్టి లో పెట్టుకొని ఏడు డిపోల పరిధిలో 33,99,80 4 కి.మీ మేర బస్సులు తిరిగాయి. అత్యధికంగా సూర్యాపేట డిపోకు రూ.47,17,165 అదనపు ఆదాయం సమకూరగా, రూ.33, 78,701 ఆదాయంతో యాదగిరిగుట్ట డిపో రెండో స్థానంలో నిలిచిం ది. మూడో స్థానంలో మిర్యాలగూడ డి పో నిలవగా, రూ.23,19,230 ఆదాయం సమకూరింది. దసరా, బతుకమ్మ నేపథ్యంలో ఆర్టీసీ ప్రణాళికా బద్ధంగా ప్రత్యేకంగా బస్సు సర్వీసు లు నడిపింది. ఇక పండుగలను మినహాయిస్తే ఉమ్మడి జిల్లాలో ఏడు డిపోల పరిధిలో ప్రతీ రోజు 680 బస్సులు నిత్యం పలు రూట్లలో 2.60లక్షల కి.మీలు ప్రయాణిస్తాయి. అందుకు సంస్థకు ప్రతీ రోజు రూ.1.50కోట్ల ఆదాయం సమకూరుతోంది. ఈ ఆదాయం కాకుండా పండుగ సెలవుల్లో ఆర్టీసీకి అదనంగా రూ.1.65 కోట్లకు పైగా ఆదాయం సమకూరింది. పండుగ సెలవుల్లో డిమాండ్‌కు అనుగుణంగా ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ప్రయాణికులను వారి గమ్యస్థానాలను చేర్చేందుకు ఎలక్ట్రికల్ బస్సులు కూడా నడిపింది.

ప్రజలకు మెరుగైన ప్రయాణాన్ని కల్పించాం



దసరా, బతుకమ్మ పండుగలను పురస్కరించుకొని సెలవుల్లో పెద్ద సంఖ్యలో బస్సు సర్వీసులను నడిపించాం. రీజియన్ మొత్తం 597 అదనపు బస్సులు తిప్పడం ద్వారా ఆర్టీసీకి రూ.1,65,605 అదనపు ఆదాయం సమకూరింది. ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణంతో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పించాం. డిమాండ్‌కు అనుగుణంగా అన్ని రూట్లలో బస్సులు నడిపి చర్యలు తీసుకున్నాం. మహిళా ప్రయాణికులకు అసౌకర్యం లేకుండా బస్సులు నడిపాం. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలకు బస్సు సర్వీసులు అధిక సంఖ్యలో నడిపించాం.
- కె.జానిరెడ్డి, ఆర్ఎం నల్లగొండ

రీజియన్ పరిధిలో దసరాలో బస్సుల సంఖ్య, ఆదాయం ఇలా..

డిపో	నడిచిన బస్సులు	తిరిగిన కి.మీలు	అదనపు ఆదాయం
దేవరకొండ	60	5,40,020	14,95,942
కోదాడ	92	4,20,051	21,55,178
మిర్యాలగూడ	69	5,19,777	23,19,230
నల్లగొండ	65	6,20,113	9,63,574
నార్కట్‌పల్లి	48	93,362	15,48,815
సూర్యాపేట	130	7,37,994	47,17,165
యాదగిరిగుట్ట	133	4,68,487	33,78,701
మొత్తం	597	33,99,804	1,65,78,605

రయ్.. రయ్‌మంటూ..



హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై యదాద్రి జిల్లా చౌటుప్పల్ వద్ద వాహనాల రద్దీ

» హైవేపై కొనసాగుతున్న రద్దీ
» 27 కిలోమీటర్ల ప్రయాణానికి రెండు గంటలు
» వాహనాలతో చౌటుప్పల్ దిగ్బంధనం

4

ఇసుకేస్తే రాలనంత రద్దీ. బండెనక బండె కట్టి వేలాది బండ్లు కట్టిన తీరున సోమవారం కూడా జాతీయ రహదారి రద్దీగా కన్పించింది. అడుగుకో వాహనంతో ఇటు ప్రయాణికులు, అటు వాహనదారులు ఆగమాగమయ్యారు. ఇక ద్విచక్రవాహనదారుల పరిస్థితి దయనీయం. అటు ఎండతాపం, ఇటు వాహనాల వేడి, కాలుష్యానికి ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఎండలకు చిన్నపిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడ్డారు. ఇక జాతీయ రహదారులపై హోటళ్లు, రెస్టారెంట్లు రద్దీగా మారాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని చౌటుప్పల్‌లో వాహనాల రద్దీ కన్పించగా, బీబీనగర్, కేతేపల్లి మండలాల పరిధిలోని టోల్ గేట్ల వద్ద వాహనాల రద్దీ సాధారణంగా ఉంది.

అప్పటి వరకు రావొద్దు



ప్రైవేట్ పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ స్కీమ్ (బీఏఎస్)ను ప్రవేశపెట్టింది. విద్యలో ప్రతిభ కనబర్చిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు బీఏఎస్ కింద ఎంపికైన పాఠశాలల్లో చదువుకునే వీలు కల్పించింది. విద్యార్థుల ఫీజును ఉపకార వేతనాలుగా ప్రైవేట్ పాఠశాలలకు చెల్లించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. కాగా, బీఏఎస్‌లో సీటు సాధించి ప్రైవేట్ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు, ప్రభుత్వం మూడేళ్లుగా ఉపకారవేతనాలు చెల్లించడం లేదు. దీంతో యాజమాన్యాలు ఆందోళనబాటపట్టాయి. అంతేగాక ఉపకారవేతనాలు వచ్చేంతవరకు పాఠశాలకు రావొద్దని యాజమాన్యాలు చెబుతున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- (ఆంధ్రజ్యోతి,కోదాడ)

» బీఏఎస్ స్కీం పాఠశాలలకు అందని ఉపకార వేతనాలు
» మంజూరయ్యేంతవరకు విద్యార్థులను రావొద్దంటున్న యాజమాన్యాలు » ప్రభుత్వం రూ.25 కోట్ల మేర బకాయి

ఉమ్మడి జిల్లాలో 18 ప్రైవేట్ పాఠశాలలు బీఏఎస్ కింద ఎంపికయ్యాయి. ఆయా పాఠశాలల్లో 2,700 మంది విద్యార్థులు 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యనభ్యసిస్తున్నా రు. వీరికి సంబంధించి మూడేళ్లుగా ఉపకారవేతన బకాయిలు రూ.25కోట్లు ప్రైవేట్ పాఠశాల ల యాజమాన్యాలకు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. ఉపకార వేతనాలు విడుదల కాకపోవటంతో బీఏఎస్ పాఠశాలల యాజమాన్యాలు బంద్‌కు సిద్ధమయ్యాయి. అందులో భాగంగా సోమవారం పాఠశాలల బంద్‌ను పాటించాయి. దీంతో విద్యార్థులు దసరా సెలవుల అనంతరం పాఠశాలకు వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది. విద్యకు దూరంకావాల్సిన పరిస్థితి నెలకొందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఉపకారవేతనాలు విడుదల చేయకపోవడంతో ఉపాధ్యాయులకు వేతనాలు, విద్యార్థులకు భోజనం,వసతి సదుపాయాలు కల్పించలేకపోతున్నామని బీఏఎస్ పాఠశాలల యాజమాన్యాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఉపకారవేతనాలు రాకపోవడంతో విద్యార్థులను పాఠశాలలకు అనుమతించడంలేదని, తల్లిదండ్రులు సహకరించాలని యాజమాన్యాలు కోరుతున్నాయి. ప్రభుత్వం బకాయిలు విడుదల చేసి, విద్యార్థులు చదువుకునే వీలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నాయి.

హాస్టల్ విద్యార్థికి రూ.42వేలు వ్యయం



ఉమ్మడి జిల్లాలో 18 బీఏఎస్ పాఠశాలలు ఉండగా, వాటిలో 2,700 మంది విద్యార్థులు చదువుతున్నారు. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు చదివే ఒక్కో విద్యార్థికి డేస్కాలర్ కింద పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫామ్స్, రవాణ ఖర్చులకు రూ.27వేలు, 6వ తరగతి నుంచి 10 వరకు చదివే హాస్టల్ విద్యార్థికి పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫామ్స్‌తో పాటు, భోజనం కింద రూ.42,000 ఉపకార వేతనంగా ప్రభుత్వం చెల్లిస్తోంది. దీని ప్రకారం 2,700 మంది విద్యార్థులకు 2022-23, 2023-24, 2024-2025 విద్యా సంవత్సరాలకు

- మిగతా 5వ పేజీలో...

బకాయిలు విడుదల కాకపోవడంతోనే బంద్...

ప్రభుత్వం ఏటా ఏప్రిల్‌లో బీఏఎస్ పాఠశాలల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేస్తోంది. మే నాటికి ప్రవేశాల ప్రక్రియ పూర్తవుతుంది. సీటు సాధించిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు జూన్ నుంచి పాఠశాలలకు హాజరవుతారు. అంత వరకు బాగానే ఉన్న మూడేళ్లుగా ప్రభుత్వం విద్యార్థులకు సంబంధించిన బకాయిలు విడుదల చేయడంలేదు. దీంతో విద్యార్థులకు బుక్స్‌తోపాటు, భోజనం, ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించడం కష్టంగా మారింది. ఒక్కో పాఠశాలకు ప్రభుత్వం రూ.1.50కోట్లకుపైగా బకాయిలు చెల్లించాల్సి ఉంది. అప్పు తెచ్చి పాఠశాలలు నడపాలంటే భారంగా ఉంది. వడ్డీలు చెల్లించలేకపోతున్నాం. బకాయిలపై రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించినా ఫలితంలేకపోవడంతోనే రాష్ట్రవ్యాప్తంగా 210 బీఏఎస్ పాఠశాలలు బంద్ బాట పట్టాల్సి వచ్చింది. ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించి బకాయిలు విడుదల చేసి, రాష్ట్ర వ్యాప్తంగా బీఏఎస్ పాఠశాలలో చదువుతున్న 30వేల మంది విద్యార్థులతోపాటు, ఉమ్మడి జిల్లాలోని 2,700 మంది విద్యార్థుల విద్యకు ఆటంకం, యాజమాన్యాలపై భారంగా లేకుండా చూడాలి.
- లింగారెడ్డి, బీఏఎస్ పాఠశాలల యాజమాన్యాల సంఘం రాష్ట్ర కన్వీనర్

తరగతి గదుల నిర్మాణం పూర్తిచేయాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

త్రిపురారం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అదనపు తరగతి గదుల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని, క్రీడామైదానాన్ని అభివృద్ధి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలోని గిరిజన బాలికల సంక్షేమ మినీ గురుకుల పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వసతి సౌకర్యాలు తెలుసుకొని అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించారు. అదనపు తరగతి గదులు, క్రీడామైదానం అభివృద్ధికి సత్వర చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరుపులు లేక నేలపై పడుకుంటున్నామని విద్యార్థులు తెలపగా, వెనువెంటనే జిల్లా కేంద్రం నుంచి పంపిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీచేశారు. ఫార్మసీలో అందుబాటులో ఉన్న మందులను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. అధికారులు విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించవద్దని హెచ్చరించారు. కార్యక్రమాల్లో సబ్‌కలెక్టర్ అమిత్ నారాయణ్, గృహనిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, ప్రిన్సిపాల్ భారతి, తహసీల్దార్ ప్రమీల, ఎంపీడీవో విజయలక్ష్మి, వైద్యుడు సంజయ్‌సాహా, ఉన్నారు.

బీఏఎస్ విద్యార్థుల సమస్యలు తీర్చాలి



కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగార్జున

కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

నల్లగొండ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): బెస్ట్ అవెలబుల్ స్కూల్ (బీఏఎస్) విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం సమస్యలను కలెక్టర్ ఇలా త్రిపాఠి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించాలనే లక్ష్యంతో బీఏఎస్‌ను ప్రారంభించగా, మూడేళ్లుగా పాఠశాలలకు పెండింగ్ ఉపకార వేతనాలు విడుదల చేయడం లేదన్నారు. దీంతో వేలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 20,038 పాఠశాలల్లో 23వేల మంది ఎస్సీ విద్యార్థులు, 7వేల మంది ఎస్టీ విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ నాయకులు కార్తీక్, మామిడి జగన్, స్వామి, గాదె నర్సింహ, శోభన్, పెరుమాళ్ల సాహితీ, అరుణ, రాజేశ్వరీ, లక్ష్మి, సోమని, శ్యామ్, నరేష్, నామ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిధులను విడుదల చేయాలి

ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ స్కీమ్ నిధులకు వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్ డిమాండ్ చేశారు. సోమవారం నల్లగొండలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ బెస్ట్ అవైబుల్ స్కీమ్ కింద చదువుతున్న విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని ఆరోపించారు. జిల్లాకు చెందిన మంత్రి కేవలం 15 రోజుల్లో డబ్బులు ఇప్పిస్తానని చెప్పి రెండు నెలలైనా విడుదల కాలేదన్నారు. నిధుల మంజూరుకు పోరాటానికి విద్యార్థులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

నల్లగొండరూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల ఔట్‌సోర్సింగ్ నాన్ టీచింగ్ ఉద్యోగుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ డిమాండ్ చేశా రు. సోమవారం ఈ మేరకు అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో 14 సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయన్నారు. వాటిలో వాచ్‌మెన్, అటెండర్, ఎలక్ట్రీషియన్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఐసీటీ కేటగిరీల్లో పాఠశాలకు ఐదుగురు చొప్పున 70 మంది విధులు నిర్వహిస్తున్నారన్నారు. వీరికి ఆరు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే నిరవధిక సమ్మె తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి పెరుమాళ్ల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం తప్పని తిప్పలు

వర్షంతో పోలీస్‌స్టేషన్‌లో తలదాచుకున్న రైతులు



టోకెన్ల కోసం తెల్లవారుజాము నుంచే వేచి ఉన్న రైతులు

తిరుమలగిరి(సాగర్), అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): సకాలంలో యూరియా అందకపోవడంతో రైతులకు తిప్పలు తప్పడం లేదు. దసరా పండుగ ముందు నుంచి సుమారు వారం రోజులుగా మండలానికి యూరియా దిగుమతి లేదు. దీంతో సోమవారం ఉదయం అధికారులు యూరియాను పంపిణీ చేస్తారన్న సమాచారంతో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన రైతులు మండల కేంద్రానికి వచ్చారు. వ్యవసాయ మార్కెట్‌యార్డులోని గోదాం వద్దకు సోమవారం అర్ధరాత్రి దాటాక చేరుకొని పడిగాపులు కాశారు. యూరియా కోసం రైతులు రాగా, అదే క్రమంలో భారీ వర్షం కురిసింది. గత్యంతరం లేక రైతులు సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో తలదాచుకున్నారు. వర్షం తగ్గాక తెల్లవారుజామున గోదాం వద్దకు చేరుకున్నారు. గోదాం వద్ద పెద్ద సంఖ్యలో రైతులు గుమికూడడంతో క్యూలో నిలబెట్టేందుకు పోలీసులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. అనంతరం రైతుల నుంచి ఆధార్‌కార్డులు, పట్టాదారు పాస్‌పుస్తకాలు తీసుకొని పీఏసీఎస్, వ్యవసాయశాఖ సిబ్బంది వచ్చాక టోకెన్లు ఇచ్చారు. సోమవారం 20 మెట్రిక్ టన్నుల యూరియా రాగా, రైతులు పెద్ద సంఖ్యలో రావడంతో టోకెన్లు కొందరికే లభించగా, మిగతా రైతులు ఉసూరుమంటు తిరిగివెళ్లిపోయారు.

విద్యార్థుల హాజరును నూరుశాతం పెంచాలి

డీఈవో భిక్షపతి

గుర్రంపోడ్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సెలవుల అనంతరం విద్యార్థుల హాజరును రెండు రోజుల్లో నూరుశాతానికి పెంచేలా కృషి చేయాలని జిల్లా విద్యాధికారి బి.భిక్షపతి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కేజీబీవీ, పిట్టలగూడెం ప్రాథమిక, ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీచేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేజీబీవీలో సెలవులకు ఇంటికి వెళ్లిన విద్యార్థినులను రప్పించేలా తల్లిదండ్రులతో మాట్లాడి హాజరుశాతం పెంచాలని సూచించారు. పాఠశాల ఆవరణ, మరుగుదొడ్లు, వంటగదులను శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. గ్రామాల్లో 14 ఏళ్ల నిండి ఏ కారణంతోనైనా బడి మానివేసిన వారిని గుర్తించి ఓపెన్ టెన్త్‌లో చేర్పించేలా ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కేజీబీవీలో వంట గది, స్టోర్‌రూమ్‌ను పరిశీలించి ఎస్‌వో విజయశ్రీకి పలు సూచనలు చేశారు.

ఆంధ్రజ్యోతి సదా మీ సేవలో...
అచిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా !
పత్రికా పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా మాకు ఫోన్ చేసి చెప్పవచ్చును. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా వుంటారు.
సంప్రదించగలరు :
మిర్యాలగూడ, దేవరకొండ, హాలియా
ACM - 9985411394
Miryalguda ACO- 9963624250, Miryalguda SR - 9542690885,
Devarkonda SR - 9392062350, Haliya SR - 9885226544,

క్యూలైన్‌లోనే కునుకు..!


క్యూలైన్‌లో కునుకు తీస్తున్న రోగులు

బీబీనగర్ ఎయిమ్స్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): బీబీనగర్ ఎయిమ్స్ రోగులు, వారి బంధువులు పడరాని పాట్లు పడుతున్నారు. గంటల కొద్దీ నిరీక్షించాల్సి రావడంతో క్యూలైన్‌లోనే కునుకు తీస్తున్నారు. సోమవారం బీబీనగర్‌లో ఎయిమ్స్‌లో అవుట్ పేషంట్ టోకెన్లకోసం క్యూలైన్‌లో తీవ్ర ఇబ్బందులుపడ్డారు. తక్కువ ఖర్చుతో సామాన్యులకు వైద్యం అందుతుండటం, దూర ప్రాంతాలకు చెందిన రోగులు ఎక్కువ సంఖ్యలో వస్తున్నారు. దీంతో రద్దీ పెరిగి రోగులు క్యూలైన్‌లో పడిగాపులుకాస్తున్నారు. ఎయిమ్స్‌లో మెడికల్ హాల్ ఉన్నా సరిపడా మందులు దొరకడం లేదు. ఇక్కడ కూడా గంటల తరబడి బారులు తీరుతున్నారు. అవసరానికి డాక్టర్ రాసిన చిన్న చిన్న మందులు, సామగ్రి కూడా అందుబాటులో లేకపోవడంతో బయటకు పరుగులు తీస్తున్నారు.

గుండెపోటుతో మాజీ కౌన్సిలర్ మృతి


రామకృష్ణ(ఫైల్)

మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ మునిసిపాలిటీ పరిధిలోని 14వ వార్డు(రాంనగర్)మాజీ కౌన్సిలర్ గంధం రామకృష్ణ(52) గుండెపోటుతో సోమవారం మృతిచెందారు. ఛాతినొప్పితో ఇంట్లో పడిపోయిన అతన్ని కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు ఆరోగ్యపరిస్థితి విషమంగా మారుతుందని గుర్తించి, అత్యవసర వైద్యసేవలు అందిస్తుండగా మృతిచెందారు. రామకృష్ణకు భార్య సంధ్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. రామకృష్ణ మృతికి ఎమ్మెల్యే బీఎల్ఆర్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌లతోపాటు పలువురు కాంగ్రెస్ నేతలు సంతాపం వ్యక్తం చేశారు.

యువకుడి అదృశ్యం


ఆరాల భరత్

మాడ్గులపల్లి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్టకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన యువకుడు అదృశ్యమైన ఘటన నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలోని కేశవాపురం గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు, మాడ్గులపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కేశవాపురం గ్రామానికి చెందిన 26 ఏళ్ల వయస్సుగల ఆరాల భరత్ అనే యువకుడు ఈ నెల 29న యాదగిరిగుట్టకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటినుంచి బయలు దేరాడని, అప్పటినుంచి ఇంటికి తిరిగి రాలేదని తెలిపారు. ఈమేరకు భరత్ తండ్రి భిక్షమయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు. భరత్ ఆచూకీ తెలిసిన వారు సెల్:8712670192, 9963742218కు తెలపాలన్నారు.

రయ్.. రయ్‌మంటూ..

● హైవేపై కొనసాగుతున్న రద్దీ ● 27 కిలోమీటర్ల ప్రయాణానికి రెండు గంటలు ● వాహనాలతో చౌటుప్పల్ దిగ్బంధనం


యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో వాహనాల రద్దీ

చౌటుప్పల్ రూరల్, కేతేపల్లి, బీబీనగర్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-విజయవాడ 65వ నెంబర్ జాతీయరహదారి సోమవారం కూడా పోటెత్తింది. దసరా పండుగకు సొంతూళ్లకు వెళ్లిన ప్రజలు సోమవారం హైదరాబాద్ బాటపట్టడంతో జాతీయరహదారి వాహనాలతో దిగ్బంధమైంది. ఉదయం సాధారణంగా కన్పించిన రద్దీ ఏడు గంటల తర్వాత ఒక్కసారిగా పెరిగిపోయింది. నిమిష.. నిమిషానికి వాహనాల సంఖ్య పెరగడంతో రద్దీ తీవ్రమైంది. చౌటుప్పల్ మండల పరిధిలోని రెడ్డిబావి నుంచి తూప్రాన్‌పేట వరకు వందలాది వాహనాలు హైవేపై బారులుతీరాయి. జాతీయ రహదారిపై ఎక్కడ చూసినా వాహనాల రద్దీ కన్పించింది. ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వాహనాల బారులు తీరి వెళ్లాయి. అడుగుఅడుగున ట్రాఫిక్ రద్దీ నెలకొంది. మండల పరిధిలో 27 కిలోమీటర్ల ప్రయాణానికి గంటన్నరకు పైగా సమయం పట్టడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందుపడ్డారు. రోడ్డు క్రాసింగ్‌లు దాటడానికి స్థానిక ప్రజలకు అరగంట సమయం పట్టింది. చౌటుప్పల్ పట్టణం వాహనాలతో దిగ్బంధమైంది. ఉదయం ట్రాఫిక్ పోలీసులు చాలా ఆలస్యంగా రావడంతో తంగడపల్లి రోడ్డు, వలిగొండ రోడ్డు, బస్టాండ్ హైవేపై వద్ద ట్రాఫిక్ స్తంభించింది. ట్రాఫిక్ పెరిగిపోవడంతో పోలీసులు సైతం ఏమిచేయలేని పరిస్థితి నెలకొంది. స్థానిక పోలీసులు, ట్రాఫిక్ పోలీసులతోపాటు ప్రత్యేక బలగాలను రప్పించారు. పట్టణంలో దాదాపు నాలుగు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. హైవేపై ట్రాఫిక్ స్తంభించడంతో వాహనాలు సర్వీసు రోడ్డు గుండా వెళ్లాయి. చౌటుప్పల్‌లో వాహనాలు గల్లీల్లోంచి రోడ్డెక్కాయి. దీంతో సర్వీస్‌రోడ్డులో సైతం ట్రాఫిక్ స్తంభించింది. బస్టాండ్ వద్ద ప్రజలు బస్సులకోసం గంటల తరబడి నిరీక్షించారు. ట్రాఫిక్‌తో వాహనదారులు ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. దసరా పండుగ తిరుగు ప్రయాణికులతో యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేట్ వద్ద వాహనాల రద్దీ నెలకొంది. పండుగకు స్వగ్రామాలకు వెళ్లి తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరడంతో టోల్‌గేటు వాహనాలతో కిక్కిరిసింది. వందలాది వాహనాలు టోల్‌గేటు వద్ద బారులు తీరడంతో ట్రాఫిక్ స్తంభించింది. టోల్‌గేటు దాటడానికి వాహనదారులకు అరగంట సమయం పట్టింది. టోల్‌గేటు వద్ద 16గేట్లకు 10 గేట్ల ద్వారా వాహనాలను హైదరాబాద్ వైపు మళ్లించారు. సాధారణ రోజుల్లో 35వేలకుపైగా వాహనాల రాకపోకలు సాగిస్తుండగా తిరుగు ప్రయాణికలతో అదనంగా 25 వేలకు పైగా వాహనాలు రాకపోకలు సాగించాయి.

సాధారణ స్థితికి చేరిన జాతీయ రహదారి

దసరా పండగకు వెళ్లి హైదరాబాద్, విజయవాడలకు తిరుగు ప్రయాణమైన వాహనాల రణగొణ ధ్వనులతో గత రెండు రోజులుగా దద్దరిల్లిన 65వ నెంబరు జాతీయ రహదారి నల్లగొండ జిల్లా కేతేపల్లి పరిధిలో సోమవారం సాయంత్రం ప్రశాంతతను సంతరించుకుంది. దసరా పండగ, విద్యా సంస్థలకు సెలవులు ముగియడంతో సోమవారం నుంచి ఆయా ప్రాంతాల్లో తాము చేసే ఉద్యోగాల్లో చేరేందుకు వారంతా హైదరాబాద్, అమరావతికి ఆదివారం తిరుగు పయనమైన నేపథ్యంలో బారులు కట్టి గుంపుగుంపులుగా వెళ్లే వాహనాలతో శని, ఆదివారాల్లో 65వ నెంబరు జాతీయ రహదారి రద్దీగా మారింది. రహదారి వెంట గ్రామాల్లోని జంక్షన్‌ల వద్ద హైవేను దాటేందుకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. శని, ఆదివారాల్లో పెద్ద ఎత్తున తరలి వెళ్లడంతో సోమవారం సాయంత్రం వరకు ఈ రహదారిపై వాహనాల రాకపోకలు సాధారణ స్థితికి చేరాయి.

మండలంలోని కొర్లపహాడ్ గ్రామ శివారులోని టోల్‌ప్లాజాలో వాహనాలు అంతగా లేకపోవడంతో టోల్ వసూలు కౌంటర్లు బోసిపోయి కనిపించాయి.

యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోని హైదరాబాద్-వరంగల్ 163వ జాతీయ రహదారిపై దసరా పండుగ రద్దీ తగ్గుముఖం పట్టింది. దీంతో సోమవారం బీబీనగర్ మండలం గూడూరు టోల్ ప్లాజా వద్ద సాధారణ పరిస్థితి కన్పించింది. దసరా పండుగకు హైదరాబాద్‌లో స్థిరపడిన పల్లె ప్రజలంతా సొంతూళ్లకు పయనంకావడంతో పండుగకు ముందు వరంగల్ వైపు హైవే మార్గంలో రద్దీపెరిగింది. పండుగ అనంతరం పల్లె జనమంతా తిరుగు ప్రయాణం కావడంతో హైదరాబాద్ వైపు హైవే మార్గం శుక్రవారం నుంచి ఆదివారం అర్ధరాత్రి వరకు వాహనాల రద్దీ పెరిగింది. దీంతో గూడూరు టోల్‌ప్లాజా వద్ద అటు మూడు రోజులు.. ఇటు మూడు రోజులు బారులు తీరాయి. ఇప్పుడు రద్దీ తగ్గడంతో యధాస్థితికి చేరింది.

ట్రాఫిక్‌లో చిక్కుకున్న అంబులెన్స్‌లు



ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయిన అంబులెన్స్‌లు

చౌటుప్పల్ మండలం పంతంగి వద్ద రెండు అంబులెన్స్‌లు ట్రాఫిక్‌లో చిక్కుకోవడంతో క్షతగాత్రులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. నల్లగొండ నుంచి క్షతగాత్రులతో హైదరాబాద్‌కు వెళ్తున్న రెండు అంబులెన్స్‌లు పంతంగి వద్ద ట్రాఫిక్‌లో చిక్కుకున్నాయి. రెడ్డిబావి వద్ద ట్రాఫిక్‌లో చిక్కుకున్న అంబులెన్స్‌లు అతి కష్టం మీద టోల్‌గేటు వద్దకు వచ్చాయి. అక్కడ వాహనాలు బారులు తీరడంతో అంబులెన్స్‌కు దారిలేక ఇరుకున్నాయి. అంబులెన్స్‌లు, వీఐపీ వాహనాలను పంపించే గేటు ద్వారా సైతం దసరా వాహనాలను పంపించడంతో అంబులెన్స్‌లు వెళ్లడానికి దారిలేకుండా పోయింది. అతి కష్టం మీద అంబులెన్స్ గేటు దాటాయి. అంబులెన్స్‌లు ట్రాఫిక్ దాటడానికి అరగంట పట్టింది. ట్రాఫిక్‌తో క్షతగాత్రులు ఇబ్బందులుపడ్డారు.

ప్రయాణికులతో కిక్కిరిసిన బస్టాండ్


సూర్యాపేట జిల్లా కోదాడ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

కోదాడరూరల్: కోదాడ ఆర్టీసీ బస్టాండ్ సోమవారం ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. బస్సులకోసం ప్రయాణికులు గంటల కొద్దీ వేచి చూడాల్సిన దుస్థితి. దసరా సెలవులు ముగియటంతో కళాశాలలు, స్కూళ్లకు వెళ్లేందుకు గ్రామీణ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున విద్యార్థులు, తమ స్వస్థలాలకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. దసరా పండుగకు సొంతూరు వెళ్లేవారు తిరిగి తాము ఉద్యోగాలకు చేరేందుకు బయలుదేరారు. దీంతో కోదాడ ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికులతో కిటకిటలాడిపోయింది. రద్దీకి అనుగుణంగా బస్సులు ఏర్పాటుచేయకపోవడంతో ప్రయాణికులు నానా అవస్థలుపడ్డారు. ఉదయం 10 గంటల నుంచి 5గంటల వరకు హైదరాబాద్ వెళ్లేందుకు బస్సులులేక అనేకమంది హైదరాబాద్‌లో చదివే ఇంజనీరింగ్ విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. దీంతోపాటు వివిధ గ్రామాల నుంచి సొంతూళ్లకు వెళ్లేందుకు ప్రయాణికులు బస్టాండ్‌కు వచ్చి, బస్సులు లేవని వారు ఆవేదన వ్యక్తంచేశారు. ఖమ్మం, మిర్యాలగూడ, నల్లగొండ, సూర్యాపేటకు పండుగ సమయాల్లో కూడా ప్రత్యేక బస్సులు నడపలేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతోపాటు మేళ్లచెర్వు, హుజూర్‌నగర్, జగ్గయ్యపేటలో కూడా ప్రయాణికులకు రద్దీకి తగ్గట్టుగా బస్సులు నడపటం లేదన్నారు. హైదరాబాద్ వెళ్లేందుకు విజయవాడ నుంచి వస్తే తప్ప డిపో నుంచి బస్సులు ఏర్పాటు చేయలేదన్నారు. ఈ విషయంపై కొందరు ప్రయాణికులు ఆర్టీసీ అధికారులతో ఘర్షణకు దిగారు. అయినా డిపోలో ఉన్న 50 ఎక్స్‌ప్రెస్ బస్సులను తిప్పుతున్నామన్నారు. కొత్తగా బస్సులు ఎక్కడి నుంచి తీసుకరావాలని వారు ప్రయాణికులను ప్రశ్నించారు. దీంతో ఉదయం 10 గంటలకు బస్టాండ్‌కు వచ్చిన ప్రయాణికులు 4గంటల వరకు కూడా నిరీక్షించాల్సిన పరిస్థితి ఉందన్నారు.

ప్రయాణికులను దోచుకుంటున్న ప్రైవేట్ ట్రావెల్స్

కోదాడ నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు సరైన బస్సులు లేకపోవడంతో సోమవారం ప్రయాణికులు నానా ఇబ్బందులుపడ్డారు. హైదరాబాద్ వెళ్లేందుకు 5గంటలపాటు నిరీక్షించినా బస్సులు లేవని ప్రయాణికులు తెలిపారు. ప్రైవేట్ ట్రావెల్స్ కార్లను ఆశ్రయిస్తే హైదరాబాద్‌కు రూ. 800 నుంచి రూ.1000 డిమాండ్‌చేస్తున్నారు. గత్యంతరం లేక అనేక మంది ప్రైవేట్ ట్రావెల్స్‌ను ఆశ్రయించాల్సి వచ్చిందన్నారు.

ఉమ్మడి జిల్లాలో ముగ్గురి ఆత్మహత్య


మృతదేహాన్ని తీసుకొస్తున్న పోలీసులు

అర్వపల్లి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వేర్వేరు మండలాల్లో సోమవారం ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. అర్వపల్లి మండలంలో ఒకరు, మద్దిరాల మండలంలో మరొకరు, వలిగొండ మండలంలో ఇంకొకరు బలవన్మరణం చెందారు. సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం సీతారాంపురం, పర్సాయిపల్లి గ్రామాల మధ్య గుట్టల మధ్య ఉరేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్ జిల్లా బేతంచర్ల పట్టణం కోటాపేటకు చెందిన సంచార జాతికి చెందిన పుసల బద్రి(45) చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సీతారాంపురం గ్రామానికి చెందిన బిక్కయ్య వ్యవసాయ పొలం వద్ద టేకు చెట్టుకు ఉరేసుకొని వేలాడుతుండడంతో స్థానికులు చూసి అర్వపల్లి పోలీసులకు సమాచారం అందించారు. ఆత్మహత్య చేసుకున్న ప్రాంతానికి 10 అడుగుల దూరంలో బద్రికి సంబంధించిన బైక్, ఆధార్ కార్డులు, దేవుడి పటాలు పడి ఉన్నాయి. వీటిని పోలీసులు, స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బద్రి శరీర భాగాల్లో గాయాలు కావడంతో హత్యా?, ఆత్మహత్యా? అనే కోణంలో పోలీసులు విచారించే అవకాశం ఉంది. మృతదేహాన్ని తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి మార్చురీకి తరలించారు. పోలీసులు బద్రి కుటుంబ సభ్యులకు సమాచారం తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో..

మద్దిరాల: ఆర్థిక ఇబ్బందులు తాళలేక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం మండలంలోని రెడ్డిగూడెం జరిగింది. పోలీసులు, గ్రామస్థుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వల్లపు యాకయ్య (44) ఆర్థిక ఇబ్బందులు పెరగడంతో మద్యానికి బానిసయ్యాడు. దీంతో మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి 108 వాహనంలో సూర్యాపేట ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. యాకయ్య భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వీరన్న తెలిపారు.

వలిగొండ: బాల్యంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన కారణంగా ఓ యువకుడు మానసికంగా కుంగిపోయి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఎస్ఐ యుగేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మోటకొండూరు మండలం చేర్యాలకు చెందిన భూరెడ్డి అంజిరెడ్డి కుమారుడు అనిల్‌రెడ్డి (23) ఆరేళ్ల వయస్సులో ఉన్నప్పుడు తల్లిదండ్రులు చనిపోయారు. అతని ఆలనపాలనా.. ఆత్మకూరు(ఎం) మండలం లింగరాజుపల్లి గ్రామానికి చెందిన మేనమామ అయిన మెట్టు వెంకట్‌రెడ్డి చూసుకుంటున్నాడు. అనిల్‌రెడ్డి గ్రామ సమీపంలో ఎరువుల దుకాణంలో పనిచేస్తున్నాడు. తల్లిదండ్రులు లేరని తరుచూ ఆవేదనకు గురయ్యేవాడు. శనివారం తాను పనిచేస్తున్న దుకాణంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన వెంటనే చికిత్స నిమిత్తం సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. అనిల్‌రెడ్డి సోదరి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

చౌటుప్పల్ రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం శివారులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. దండుమల్కాపురం జాతీయరహదారి పక్కన హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో ఓ మృతదేహాన్ని బంక్ సిబ్బంది చూసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి ఆస్పత్రికి తరలించారు. మృతుడి వయస్సు 60 సంవత్సరాలు పైబడి ఉంటుందని తెలిపారు. అనారోగ్యం, ఆకలితో మృతి చెంది ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు.

నాలుగు షాపుల్లో చోరీ

చౌటుప్పల్ రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ పట్టణ కేంద్రం బస్టాండ్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు షాపుల తలుపులు ధ్వంసం చేసి చోరీకి పాల్పడ్డారు. ఎస్ఐ యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం.. బస్టాండ్ సమీపంలోని సర్వీస్ రోడ్డులో ఉన్న అపోలో ఫార్మసీ, హైమవతి పూజ స్టోర్, మహదేవ్ కిరాణం షాపుల్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. షాపు వెనుక భాగం తలుపులు ధ్వంసం చేసి లోనికి ప్రవేశించారు. సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. షాపుల కౌంటర్లలో ఉన్న సుమారు రూ.50వేలను ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

● దేవరకొండ మండలం కొండభీమనపల్లిలో ఘటన



ఘటనాస్థలంలో మృతదేహాలు

దేవరకొండ, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండ మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కల్వకుర్తి-జడ్చర్ల జాతీయ రహదారి-167పై దేవరకొండ మండలం కొండభీమనపల్లి వద్ద ద్విచక్రవాహనాన్ని లారీ ఎదురుగా ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరు అక్కడికి అక్కడే మృతి చెందిన సంఘటన సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. దేవరకొండ సీఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం చారకొండకు చెందిన కొంద్ర శివ ద్విచక్ర వాహనంపై మరో మహిళతో కలిసి దేవరకొండకు వస్తున్నాడు. కొండభీమనపల్లి బస్టాప్ వద్దకు రాగానే దేవరకొండ నుంచి జడ్చర్ల వెళుతున్న లారీని కారు ఓవర్‌టెక్ చేసి వెళ్లిపోయింది. దీంతో లారీ ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న కొంద్ర శివ(29), మహిళ(30) అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు సమాచారం అందించడంతో ఎస్ఐ నారాయణరెడ్డి, సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేసినట్లు సీఐ తెలిపారు. లారీని దేవరకొండ నుంచి జడ్చర్ల వైపు వెళుతున్న గుర్తు తెలియని కారు ఓవర్‌టెక్ చేసి వెళ్లిపోవడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందని, లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు. సీసీ కెమెరాల ఆధారంగా కారు ఆచూకీ తెలుసుకుంటున్నట్లు పేర్కొన్నారు. శివ జేబులో ఉన్న ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ ఆధారంగా చారకొండకు చెందిన వ్యక్తిగా గుర్తించామని, మృతి చెందిన మహిళ ఎవరనేది తెలియరాలేదని తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ద్విచక్రవాహనం ఢీకొని మరొకరు..

నాగార్జునసాగర్:నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో తన ఇంటి ముందు వాకింగ్ చేస్తుండగా ద్విచక్ర వాహనం ఢీకొని మృతి చెందాడు. సాగర్ ఎస్ఐ ముత్తయ్య తెలిపిన ప్రకారం హిల్‌కాలనీకి చెందిన తవనం వెంకట కృష్ణారెడ్డి(58) ఆదివారం రాత్రి 9.30 గంటల సమయంలో ఇంటి ఎదుట వాకింగ్ చేస్తుండగా.., అదే కాలనీకి చెందిన నాహిద్ తన ద్విచక్రవాహనాన్ని అజాగ్రత్తగా అతి వేగంగా నడుపుతూ ఢీకొట్టాడు. దీంతో వెంకటకృష్ణారెడ్డి తలకు బలమైన గాయాలు కావడంతో ఇరుగుపొరుగు వారు 108కి కాల్ చేయగా స్థానిక కమలానెహ్రూ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తెల్లవారుజామున మృతి చెందారు.

లింగ నిర్ధారణ, అబార్షన్లు చేస్తే చర్యలు

● నలుగురు నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య

సూర్యాపేటక్రైం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ, అబార్షన్లు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అబార్షన్లు చేస్తున్న నలుగురిని అరెస్ట్ చేసి కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ ఎ.వెంకటయ్య తెలిపారు. సోమవారం రాత్రి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. సూర్యాపేట పట్టణంలోని రాజీవ్‌నగర్‌లోగల అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి హరిప్రసాద్ ఫిర్యాదు మేరకు పట్టణంలోని సీతారాంపురం కాలనీకి చెందిన ఆర్ఎంపీగా పనిచేసే నేరంటి ప్రవీణ్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. విచారణలో తనతోపాటు సీతారాంపురం కాలనీకి చెందిన ఆర్ఎంపీ మనోబోలు రాంబాబు, నకిరేకల్‌కు చెందిన ల్యాబ్ టెక్నీషియన్లు అమరవాది కర్ణాకర్, షేక్ వసీమ్‌లు కలిసి గర్భిణులకు లింగ నిర్ధారణ పరీక్షలు చేసి ఆడ, మగ అని నిర్ధారించే అల్ట్రాసౌండ్ మిషన్‌ను కొనుగోలు చేసి దాని ద్వారా కొంతకాలంగా గర్భిణులకు నిబంధనలకు విరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు అంగీకరించారు. ఈ పరీక్షలు చేసినందుకు గర్భిణుల వద్ద రూ.12వేలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అదేవిధంగా పుట్టబోయేది ఆడ శిశువు అని పరీక్షలో నిర్ధారణ అయితే సదరు గర్భిణులకు అబార్షన్లుచేసి డబ్బు సంపాదిస్తున్నట్లు పేర్కొన్నారు. అబార్షన్ చేసినందుకు రూ.50వేల వరకు తీసుకుంటున్నట్లు తెలిపారు. దీంతో నలుగురిని అరెస్ట్‌చేయడంతోపాటు వారి వద్ద నుంచి అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

చీటింగ్ కేసులో రిమాండ్

నాగార్జునసాగర్, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): చీటింగ్ కేసులో నిందితుడు తీర్థాల నాగేశ్వర్ రావు కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకొని తిరుగుతున్నాడు. నిందితుడిని ఏపీలోని రెంటచింతల గ్రామంలో సాగర్ పోలీసులు పట్టుకొని సోమవారం నిడమనూరు కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు సాగర్ ఎస్ఐ ముత్తయ్య ఒక ప్రకటనలో తెలిపారు. నిందితుడికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు ఎస్ఐ వివరించారు.

సెల్‌ఫోన్ల అప్పగింత


సెల్‌ఫోన్లను అప్పగిస్తున్న ఎస్ఐ నాగేంద్రబాబు

నేరేడుగొమ్ము, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలంలోని పలు గ్రామాల్లో బాధితులు పోగొట్టుకున్న, చోరీకి గురైన మొత్తం 10 సెల్‌ఫోన్‌లను సాంకేతిక పరికరాల ఆధారంగా స్వాధీనం చేసుకున్నట్లు నేరేడుగొమ్ము ఎస్ఐ నాగేంద్రబాబు తెలిపారు. సోమవారం సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న బాధితులకు అప్పగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ కొత్త వ్యక్తులు సెల్‌ఫోన్‌ను విక్రయిస్తామంటే కొనవద్దన్నారు.

గ్యాస్ సిలిండర్ల పట్టివేత

వలిగొండ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా గ్యాస్ సిలిండ్లను నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ ఎస్ఐ యుగేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం మండలకేంద్రానికి చెందిన బెలిదే కుశకుమార్ అనే వ్యాపారి కిరాణ షాప్ నిర్వహిస్తున్నాడు. అధిక లాభార్జనకోసం గ్యాస్ సిలిండర్‌ను అక్రమంగా నిల్వచేసి విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దుకాణాన్ని తనిఖీచేశారు. ఇండియన్ సిలిండర్లు మూడు, చిన్న సిలిండర్లు ఆరు, రీఫిల్లింగ్ సామగ్రి, తూకంవేసే యంత్రాన్ని స్వాధీనం చేసుకొని సదరు వ్యాపారిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నిలిచిన ఫలక్‌నుమా రైలు


మిర్యాలగూడలో నిలిచిన ఫలక్‌నుమా రైలు

● ఇబ్బందిపడిన ప్రయాణికులు

మిర్యాలగూడటౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ (ట్రైన్ నెంబరు 12703) సాంకేతిక లోపంతో మిర్యాలగూడలో నిలిచింది. హౌరా నుంచి మిర్యాలగూడ మీదుగా సికింద్రాబాద్‌కు వెళ్తున్న క్రమంలో ఇం జిన్‌లో సాంకేతికలోపం తలెత్తడంతో 1వ నెంబరు ప్లాట్‌ఫాంపై సుమారు 2.20 గంటలపాటు నిలిచింది. పట్టణానికి ఉదయం 6.52 గంటలకు రావాల్సిన రైలు సుమారు 40 నిమిషాలు ఆలస్యంగా అంటే 7.32 గంటలకు చేరుకుంది. ఇంజన్ మొరాయించడంతో మరమ్మతు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోవడంతో మరో ఇంజన్‌ను రప్పించారు. తిరిగి 9.52 గంటలకు ప ట్టణం నుంచి రైలు బయలుదేరినట్లు అధికారు లు తెలిపారు. పండుగ నేపథ్యంలో తిరుగుప్రయాణంలో ట్రైన్ రద్దీగా ఉందని, సమయానికి గ మ్యం చేరుకోలేకపోతున్నామని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు 2.30గంటల పాటు రైలు నిలిచిపోవడంతో మహిళలు, చిన్నారులు ఇబ్బందిపడ్డారు.

యాదగిరిగుట్టకు విజయ నెయ్యి

● 25వేల నుంచి 30వేల కిలోల నెయ్యి వినియోగం ● గత నెల 21 నుంచి నిలిచిపోయిన మదర్ డెయిరీ నెయ్యి

యాదగిరిగుట్ట, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): దేవాదాయ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ఆదేశాలతో గత 15 రోజుల నుంచి విజయ నెయ్యినే యాదగిరిగుట్ట దేవస్థానంలో వినియోగిస్తున్నారు.ప్రసాదాల, నైవేద్య తయారీ దేవస్థానంలో ప్రతీనెల 25 నుంచి 30వేల కిలోల నెయ్యి వినియోగిస్తారు. ప్రభుత్వంరంగ సంస్థ విజయ డెయిరీ నష్టాల నుంచి లాభాల పట్టించేందుకు.., సంస్థను ప్రోత్సహించేందుకు దేవస్థానానికి విజయ నెయ్యి వాడేందుకు ఆదేశించారు. గత నెల 22 నుంచి విజయ డెయిరీ నెయ్యి సరఫరా జరుగుతోంది.

10,500 లీటర్ల సేకరణ

దేవస్థానంలో ఏడాదికి సుమారు 25వేల కిలోలకుగాను రూ.18.27కోట్ల విలువైన నెయ్యి వినియోగిస్తున్నారు. కాగా, ఉమ్మడి జిల్లాలో యాదగిరిగుట్ట, వలిగొండ, సూర్యాపేట, తిరుమలగిరి, మోత్కూరులో పాల శీతలీకరణ కేంద్రాలు ఉండగా కొత్తగా బొమ్మలరామారం, రాజాపేటలో కేంద్రాల ఏర్పాటుకు యోచిస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని సుమారు 1,400మంది రైతుల నుంచి విజయ డెయిరీ 10,500 లీటర్ల పాలు సేకరిస్తోంది. ఇందులో యాదగిరిగుట్ట కేంద్రం నుంచి 7వేలు, వలిగొండ 2వేలు, మోత్కూరు 1,500 లీటర్ల పాలు సేకరిస్తున్నారు.

పాత ధరకే విజయ నెయ్యి

గతంలో మాదిరిగానే కిలో నెయ్యికి జీఎస్టీతో కలిపి రూ.609 నిర్ణయించారు. కాగా, ఇప్పటికే దేవస్థానానికి రెండు విడతల్లో 140 క్యాన్లు చేరవేశారు. ప్రతీనెల 25 నుంచి 30 వేల కిలోల నెయ్యి వినియోగిస్తున్నారు. కాగా, ఏడాదికి 30 వేల కిలోలకు రూ. 21,92,40,000 చెల్లించాల్సి ఉంటుంది.

మదర్ డెయిరీతో నలభై ఏళ్ల బంధం


యాదగిరిగుట్టకు మదర్ డెయిరీతో 40 ఏళ్ల బంధం తెగిపోయింది. ఇక్కడి దేవస్థానానికి విజయ డెయిరీ నెయ్యి వినియోగించేందుకు ప్రభుత్వం ఈ ఏడాది మార్చిలో ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఇక్కడ ఈవోగా పని చేసిన భాస్కర్‌రావు ప్రత్యేక చొరవతో ఇప్పటి వరకు మదర్ డెయిరీ నెయ్యి వినియోగించారు. గత సెప్టెంబరు 21నుంచి మదర్ డెయిరీతో బంధం తెగిపోగా ప్రస్తుతం విజయ డెయిరీ నుంచి నెయ్యి సరఫరా చేస్తున్నారు. 435 పాల సొసైటీలు, 24 పాల శీతలీకరణ కేంద్రాలు, 32వేల మంది రైతుల నుంచి సుమారు 50 నుంచి 60వేల లీటర్ల పాలు మదర్ డైరీ సేకరిస్తోంది.

ఆర్టీసీ బస్సుల్లో ఇక..
సీట్‌బెల్ట్ తప్పనిసరి

ఆర్టీసీ బస్సుల్లో డ్రైవర్‌తో పాటు పక్కన కూర్చునే సింగిల్ సీటుకు ఇకపై తప్పని సరిగా సీట్‌బెల్ట్ ధరించేలా ఆర్టీసీ ఉన్నతాధికారులు కార్యాచరణ తీసుకువచ్చారు. ముఖ్యంగా డ్రైవర్‌తో పాటు ముందు సీట్లో కూర్చుకునే ప్రయాణికుడి సీటుకు బెల్ట్ ఏర్పాటుకు డిపో మేనేజర్లు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. దీనిపై పలువురు తమ అభిప్రాయాలు వెల్లడించారు.

● ఆంధ్రజ్యోతి, సూర్యాపేటటౌన్

ప్రమాదం తక్కువగా ఉంటుంది



ఆర్టీసీ బస్సుల్లో డ్రైవర్‌తో పాటు పక్కన కూర్చునే వ్యక్తి సీట్‌బెల్ట్ ధరిస్తే మేలు జరుగుతుంది. ప్రమాదం సమయంలో ప్రాణానికి హాని ఉండదు. ప్రమాదం జరిగినప్పుడు సీట్‌బెల్ట్ లేకుండా ప్రాణాలు పోగొట్టుకున్న వారు అనేక మంది ఉన్నారు. సీట్‌బెల్ట్ లేకుండా వాహనం నడిపే డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలి. సీట్‌బెల్ట్ నిబంధనలు ఆర్టీసీ ఉన్నతాధికారులు వేగవంతం చేయాలి.

● పేర్ల నాగయ్య, సూర్యాపేట

సీట్ బెల్ట్ తప్పనిసరి చేయాలి



ఆర్టీసీ బస్సులో డ్రైవర్‌తో పాటు పక్క సీట్ వ్యక్తికి సీట్ బెల్ట్ నిబంధన తప్పని సరిగా అమలు చేయాలి. దీనివల్ల ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుంది. చిన్నచిన్న కార్లల్లో సైతం సీట్ బెల్ట్ తప్పనిసరిగా ఉండగా ఆర్టీసీ బస్సుల్లో ఇప్పటి వరకు సీట్‌బెల్ట్ నిబంధన లేదు. డ్రైవర్‌లకు, ప్రయాణికులకు సీట్‌బెల్ట్‌పై అవగాహన కల్పించాలి. బస్సులను నిత్యం శుభ్రంగా ఉండేలా చూడాలి.

● గోగుల వీరబాబు, సూర్యాపేట


ఆర్టీసీ బస్సుల్లో సీట్‌బెల్టులు ఉండడం లేదు



కొన్ని ఆర్టీసీ బస్సుల్లో డ్రైవర్లకు సైతం సీట్ బెల్ట్‌లు కనిపించడం లేదు. అధికారులు నిత్యం బస్సులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సీట్‌బెల్ట్‌లు ఎండేలా చర్యలు తీసుకోవాలి. కొన్ని బస్సులు పూర్తి స్థాయిలో కండీషన్‌లో లేవు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలి. డ్రైవర్లు ఖచ్చితంగా సీట్‌బెల్ట్ ధరించాలి. ఆర్టీసీలో సురక్షిత ప్రయాణానికి అన్ని చర్యలు తీసుకోవాలి. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులకు అన్ని సౌకర్యాలు కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

● భాగ్యమ్మ, సూర్యాపేట.

ప్రతిసీటుకు సీట్ బెల్ట్ ఏర్పాటు చేయాలి



ఆర్టీసీ బస్సుల్లో కేవలం డ్రైవర్, పక్క సీటు వ్యక్తి మాత్రమే సీట్ బెల్ట్ ధరించేలా చర్యలు తీసుకోకుండా ఆర్టీసీ బస్సులోని అన్ని సీట్లకు సీట్ బెల్ట్ ఏర్పాటు చేయాలి. ఆర్టీసీ యాజమాన్యం తీసుకుంటున్న చర్యలు అద్భుతంగా ఉన్నాయి. సీట్‌బెల్ట్ తప్పని సరిగా వాడాలని, సీట్‌బెల్ట్ ధరించని డ్రైవర్‌కు జరిమానా విధించాలి.

● మురళి, సూర్యాపేట.

అభ్యర్థుల ఖర్చు పరిమితి దాటొద్దు

- జడ్పీటీసీ అభ్యర్థి ఎన్నికల ఖర్చు రూ.4 లక్షలు
- ఎంపీటీసీ అభ్యర్థి ఖర్చు రూ.1.50లక్షలు
- ఎన్నికల సామగ్రి, ప్రచార ఖర్చు ప్రభుత్వ నిబంధన మేరకే



స్థానిక సమరం

మోత్కూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూలు ప్రకటించడంతో ఈ నెల 8న హైకోర్టు ఏం చెబుతున్నది పక్కన బెడితే షెడ్యూలు ప్రకారం ఎన్నికల నిర్వహణకు అధికారులు సమాయత్తమవుతున్నారు. ఇటీవల కలెక్టరేట్‌లో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించి జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యులు ఎన్నికల్లో పెట్టాల్సి ఖర్చు పరిమితి ఎంత అన్నది వివరించారు. దీని ప క్రారం ఎనినకల్లో పోటీచేసే అభ్యర్థులు నిబంధనలకు లోబడే ఖర్చు చేయాల్సి ఉంటుంది. జడ్పీటీసీ అభ్యర్థి ఎన్నికల ఖర్చు పరిమితి రూ.4లక్షలు, ఎంపీటీసీ అభ్యర్థి రూ.1.50లక్షలు, సర్పంచ్ అభ్యర్థి గ్రామంలో ఐదు వేల లోపు జనాభా ఉంటే రూ.1.50లక్షలు, వార్డు సభ్యుడు రూ.30 వేలు, ఐదు వేలకు పైగా జనాభా ఉంటే సర్పంచ్ అభ్యర్థి రూ.2.50లక్షలు, వార్డు సభ్యుడు రూ.50 వేలకు మించి ఖర్చు చేయరాదు. జడ్పీటీసీ, ఎంపీటీసీ పార్టీ అభ్యర్థులకు రాజకీయ పార్టీలు ప్రచారానికి పెట్టే ఖర్చు కూడా అభ్యర్థుల లెక్కలో కలుపుతారు. అభ్యర్థుల ఎన్నికల ఖర్చుపై అబ్జర్వర్ల నిఘా ఉంటుంది. అభ్యర్థులు ఎక్కువ ఖర్చు చేసి, తక్కువ రాస్తే దాన్ని అబ్జర్వర్లు సరిచేస్తారు. ఎన్నికల సామాగ్రి, ప్రచార ఖర్చుకు ఎన్నికల సంఘం రేట్లు నిర్ణయించింది. ఆ రేట్ల ప్రకారమే ఎన్నికల ఖర్చు చూపాల్సి ఉంటుంది.

దేనికి ఎంత ఖర్చు చేయాలి అంటే..?

రోజుకు లౌడ్ స్పీకర్ అద్దె రూ.900, జనరేటర్‌తో కూడిన డీజే సిస్టమ్‌కు రూ.10వేలు, ఎల్‌ఈడీ స్క్రీన్ 8/6 అద్దె రూ.9వేలు, వాహనంపై 3డీ ఎల్‌ఈడీ అమర్చితే రూ.20వేలు, వీడియో గ్రాఫర్ కెమెరాతో కలిపి రూ.1800, డ్రోన్ కెమెరా రూ.5వేలు, మీడియం సైజ్ హైడ్రోజన్ బెలూన్ రూ.4వేలు, నలుగురైదుగురు కూర్చునే వేదిక ఏర్పాటుకు రూ.3వేలు, ఫ్లెక్సీ బ్యానర్లు 4/6 సైజ్ రూ.450, 6/6 సైజ్ రూ.700, 6/12 సైజ్ రూ.1200, 8/4 సైజ్ రూ.650, 8/6 సైజ్ రూ.900, 8/12 సైజ్ రూ.1500, 10/12 సైజ్ రూ.2వేలు, ఒక్కో బ్యాడ్జి రేటు రూ.10, పోస్టర్లు 18/23 ఇంచులు సింగిల్ కలర్ రూ.6, మల్టీ కలర్ రూ.8, 8/12 అడుగుల హోర్డింగ్ ఏర్పాటు (లేబర్‌తో కలిపి) రూ.8,500, డ్రైవర్ బత్తాతో కలిపి కారు, జీపు వాహన అద్దె రూ.2వేలు, ఇన్నోవా కారు రూ.4వేలు, టెంపో, ట్రక్, డీసీఎం వ్యాన్ అద్దె రూ.3,500, ట్రాక్టర్ రూ.వెయ్యి, ఆడియో ద్వారా పబ్లిసిటీ రూ.3వేలు, మూడు చక్రాల వాహనం రూ.1200, ద్విచక్ర వాహనం రూ.300, మినీ బస్సు (12 సీట్ల కెపాసిటీ) రూ.3,500, ఏసీ ఫంక్షన్ హాల్ కుర్చీలతో రూ.12వేలు, ఏసీ లేని ఫంక్షన్ హాల్ కుర్చీలతో రూ.8వేలు, టెంటు సైజ్‌ను బట్టి రూ.600 నుంచి రూ.1500 వరకు, పెద్ద సైజ్ కార్పెట్ రూ.150, చిన్నసైజ్ కార్పెట్ రూ.100, వాటర్ ప్యాకెట్ రూ.1, వాటర్ బాటిల్ రూ.20, టీ రూ.8, కాఫీ రూ.10, బ్రేక్‌ఫాస్టు రూ.35, భోజనం రూ.80, కూరగాయల బిర్యానీ రూ.100, చికెన్ బిర్యానీ రూ.140, మటన్ బిర్యానీ రూ.160 ఇలా ప్రతి దానికి రేటు నిర్ణయించారు. అధికారులు రాజకీయ పార్టీలకు అందజేసిన రేట్ల పట్టికలో 133 రకాల ప్రచార సామగ్రి, ఆహార పదార్థాలు, శీతల పానీయాలు ఉన్నాయి.

అప్పటి వరకు రావొద్దు..

(3వ పేజీ తరువాయి)

సంబంధించి మొత్తం మూడేళ్లకుగాను ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలో రూ.25కోట్లు ప్రైవేట్ పాఠశాలలకు బకాయిలు చెల్లించాల్సి ఉంది. బకాయిలు విడుదల కాకపోవటంతో 2025-26 విద్యా సంవత్సరంలో విద్యార్థులను తీసుకునేది లేదని విద్యాశాఖ కార్యదర్శి, కమిషనర్, ఆయా జిల్లాల కలెక్టర్లకు యాజమాన్యాలు జూన్‌లో తేల్చిచెప్పాయి. అయితే అధికారులు యాజమాన్యాలతో మాట్లాడి బకాయిలు విడుదల చేయిస్తామని హామీ ఇవ్వడంతో ఈ విద్యా సంవత్సరానికి యాజమాన్యాలు అంగీకరించాయి. అయితే ప్రస్తుత విద్యాసంవత్సరం ప్రారంభమై మూడు నెలలు పూర్తయినా ప్రభుత్వం బకాయిలు విడుదల చేయకపోవడంతో బంద్ పాటిస్తున్నామని యాజమాన్యాలు చెబుతున్నాయి. బకాయిలు విడుదల చేయకపోతే విద్యను బోధించలేమని దసరా సెలవులకు ముందే విద్యాశాఖ ఉన్నతాధికారులతోపాటు తల్లిదండ్రులకు సైతం తేల్చిచెప్పినట్టు యాజమాన్యాలు పేర్కొంటున్నాయి. అందులో భాగంగానే సోమవారం పాఠశాలల బంద్ చేపట్టినట్లు స్పష్టం చేస్తున్నాయి.

శివకేశవులకు విశేష పూజలు



యాదగిరిగుట్ట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామివారి కొండపై సోమవారం హరిహరులకు విశేష పూజలు కొనసాగాయి. స్వయంభు స్వామిఅమ్మవారికి శ్రీవైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, శ్రీ పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామివారి శివాలయంలో స్ఫటికమూర్తులకు శైవాగమ శాస్త్రరీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాత సేవతో స్వామిఅమ్మవారలను మెల్కొలిపిన అర్చకులు మూలమూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించిన పూజారులు విశ్వక్సేనుడికి తొలి పూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం వేళ అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు ఆగమశాస్త్రరీతిలో కొనసాగాయి. శివాలయంలోని ముఖమండపంలో స్ఫటిక మూర్తులను అర్చకులు వేద మంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య పంచామృతాలతో అభిషేకించారు. శివపార్వతుల ఉత్సమూర్తులకు పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు. ఆలయన ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.14,13,552ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్.వెంకట్రావు తెలిపారు. శరత్ పౌర్ణమి వేడుకలు కాగా, స్వామివారి ఆలయంలో మంగళవారం శరత్ పౌర్ణమి వేడుకలు నిర్వహిస్తునట్లు ఇన్‌చార్జి ఈవో గుగులోత్ రవినాయక్ తెలిపారు. రాత్రి 7గంటలకు బ్రహ్మోత్సవ కళ్యాణ మండపంలో నిర్వహిస్తునట్లు తెలిపారు. ఒకవేళ వర్షం కురిస్తే ఆలయం లోపల ప్రాకారమండపం లేక అద్దాల మండపంలో వేడుకలు నిర్వహిస్తునట్లు వివరించారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

● జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి మాధవి లత



మాట్లాడుతున్న కార్యదర్శి మాధవీలత

భువనగిరి టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలు తదితర దుర్వ్యసనాలను మానేసి, ప్రశాంత జీవితం గడపాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వీ.మాధవి లత అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరిలోని న్యూ హోప్ అసోసియేషన్ డీఅడిక్షన్ సెంటర్‌ను సోమవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. అందిస్తున్న చికిత్సలను అడిగి తెలుసుకున్నారు. న్యాయపరమైన సేవల కోసం టోల్ ఫ్రీ నెంబర్ 15100కు ఫోన్ చేయాలన్నారు. మానసిక వైద్యురాలు డాక్టర్ ప్రీతి స్వరూప్ మాట్లాడుతూ వ్యసనాలతో ఎదురయ్యే మానసిక సమస్యలను బాధితులు అధిగమించేలా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కృషి చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో సెంటర్ డైరెక్టర్ కోమలి, డాక్టర్ శశాంక్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రాజశేఖర్ పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్ష ఫీజు చెల్లింపునకు 14 వరకు గడువు

నల్లగొండ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎంజీయూ డిగ్రీ మూడు, ఐదో సెమిస్టర్ ఫీజు చెల్లింపు ఈనెల 14 ఆఖరు తేదీ అని ఎంజీయూ సీవోఈ ఉపేందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. యూనివర్సిటీ పరిధిలోని బీఏ, బీఎస్సీ, బీకాం మూడు, ఐదు సెమిస్టర్ విద్యార్థులు ఫీజులను ఈనెల 14లోపు ఆలస్య రుసుము చెల్లించవచ్చని, రూ.100 ఆలస్య రుసుమును ఈనెల 16లోగా చెల్లించాలని కోరారు.

సుప్రీంకోర్టు నిర్ణయం హర్షణీయం

భువనగిరి టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): బీసీ 42 శాతం రిజర్వేషన్లపై వేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేయడం హర్షణీయమని బీసీ సంఘాల నాయకులు అన్నారు. సోమవారం భువనగిరిలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి పి. ప్రమోద్‌కుమార్ మాట్లాడుతూ బీసీలకు రాజకీయ న్యాయం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి సుప్రీంకోర్టు మద్దతు ఇస్తున్నట్టు స్పష్టమైందన్నారు. రేపు హైకోర్టులో కూడా అదే తరహా న్యాయం జరుగుతుందని ఆశా భావం వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు పిట్టల బాలరాజ్, మాటూరి బాలేశ్వర్, దాసరపు నరసింహ, కోడిమాల కృష్ణ, చిన్నగారి బలరాం, దేవరకొండ నరసి ంహచారి, చామల రవీందర్, నరేష్, వడిచర్ల కృష్ణయాదవ్, సిరికొండ శివకుమార్, కవిత, ఉపేందర్, నాగరాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న బీసీ సంఘాల నాయకులు

మూసీకి మళ్లీ పెరిగిన వరద ఉధృతి



మూసీ ప్రాజెక్టు క్రస్ట్ గేట్ల నుంచి విడుదలవుతున్న వరద నీరు

కేతేపల్లి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మూసీ ప్రాజెక్టుకు సోమవారం మరోసారి ఇన్‌ఫ్లో నిలకడగా పెరిగింది. హైదరాబాద్ నగరంతో పాటు ఎగువ మూసీ పరివాహక ప్రాంతాల్లో రోజుల తరబడి విస్తారంగా కురిసిన వర్షాలకు నిండిన ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌ల గేట్లు ఎత్తడంతో 10 రోజుల క్రితం ఉగ్రరూపం దాల్చిన మూసీ క్రమంగా శాంతిస్తూ వచ్చింది. ఈ క్రమంలో గత శని, ఆదివారాల్లో ప్రాజెక్టు ఇన్‌ఫ్లో సాధారణ స్థితికి చేరింది. దీంతో ప్రాజెక్టు అధికారులు గత వారం పది రోజులుగా ఎత్తి ఉంచిన ఒక్కో క్రస్టుగేటును క్రమంగా మూసి వేస్తూ నీటిమట్టాన్ని 645అడుగుల గరిష్ఠ స్థాయికి చేర్చుతున్నారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం నుంచి ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురవడం, ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్‌ల గేట్లు ఎత్తడంతో మూసీకి ఇన్‌ఫ్లోలో పెరుగుదల చోటుచేసుకుంది. ఆదివారం సాయంత్రానికి 2248.36క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో క్రమంగా పెరుగుతూ వచ్చింది. సోమవారం ఉదయం 8761.60క్యూసెక్కులుగా నమోదైన ఇన్‌ఫ్లో సాయంత్రానికి స్వల్పంగా తగ్గి 6060.91క్యూసెక్కులుగా నమోదయ్యింది. రాబోయే రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే వీలుందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రాజెక్టు నీటిమట్టాన్ని 643.80అడుగులు(4.15టీఎంసీలు)లకు తగ్గించే చర్యల్లో భాగంగా అధికారులు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోను ప్రాజెక్టు 2, 3, 4, 8, 10నెంబరు క్రస్టుగేట్లను 2అడుగుల మేర ఎత్తడం ద్వారా 6555.55క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ఆయకట్టుకు విడుదలవుతున్న మరో 533.61క్యూసెక్కుల నీటిని కలుపుకుని ప్రాజెక్టు నుంచి మొత్తం 7137.78క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 645అడుగులు(4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 644.15అడుగులు(4.24టీఎంసీలు)గా ఉంది.

నిండు కుండలా గౌరారం ప్రాజెక్టు

శాలిగౌరారం : జిల్లాలో మధ్య తరహా ప్రాజెక్టులో ఒకటైన శాలిగౌరారం ప్రాజెక్టు నిండుకుండలా జలకళను సంతరించుకుంది. గత రెండు నెలల నుంచి కురుస్తున్న వర్షాలకు మూసీ నది ఫీడర్ ఛానల్ ద్వారా ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్టు పూర్తిగా నీటితో కళకళలాడుతుంది. ప్రస్తుతం కుడి, ఎడమ కాలువల ద్వారా వానాకాలం పంటలకు నీరందుతుంది. మండలంలోని చెరువులు, కుంటల్లో కూడా నీరు సమృద్ధిగా ఉండటంతో జలకళను సంతరించుకున్నాయి. మండల రైతులు ఆనందంలో ఉన్నారు.

నిలకడగా సాగర్ నీటిమట్టం

నాగార్జునసాగర్: సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 588 అడుగులుగా (306.1010టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 10,040 క్యూసెక్కుల నీటిని, ఎడమకాల్వ ద్వారా 9,076 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 31,871 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కులు, వరదకాల్వ ద్వారా 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 53,087 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా, ఎగువ నుంచి 56,398 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.



జలకళ సంతరించుకున్న శాలిగౌరారం ప్రాజెక్టు

గిన్నిస్ రికార్డులో శ్రీనివాస్ పంచ్

- మూడు నిమిషాల్లో 55 మిడిల్ పంచులతో రికార్డు
- శ్రీనివాస్‌ది నల్లగొండ జిల్లా తుమ్మడం గ్రామం



నిడమనూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం తుమ్మడం గ్రామానికి చెందిన కరాటే మాస్టర్ పోతుగంటి శ్రీనివాస్‌కు చోటు దక్కింది. కరాటేలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చడంతో ఆయన గిన్నిస్ బుక్‌లో పేరు నమోదు చేసుకున్నారు. రెండు నెలల క్రితం గిన్నిస్ బుక్ అవార్డు ప్రిలిమినరీకి ఎంపికైన శ్రీనివాస్ ఈ నెల 5న తమిళనాడు రాష్ట్రంలోని చెన్నై నగరంలో సివేట్ కాలేజీలో నిర్వహించిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు కరాటే డిస్‌ప్లేలో పాల్గొని మూడు నిమిషాల్లో మిడిల్ పంచ్, 30 అప్పర్ బ్లాక్స్ 30 అర్మిన్ 30 గ్రోయింగ్ కిక్స్ చేయాల్సి ఉండగా ఆయన ఏకంగా 55 పంచెస్, 42 బ్లాక్స్ 38 ఫ్రాంట్ అర్మిన్లు, 32 గ్రోయింగ్స్ కిక్స్ కొట్టి ప్రతిభ చాటారు. దీంతో బుక్ రికార్డులో తన పేరును నమోదు చేసుకుని కల సాకారం చేసుకున్నారు. శ్రీనివాస్ 20ఏళ్లుగా కరాటే మాస్టర్‌గా పని చేస్తూ ఎంతోమంది విద్యార్థులకు ఆత్మరక్షణకు కరాటేలో శిక్షణ ఇస్తున్నాడు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాడు. పలువురు విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పాల్గొని ఎన్నో అవార్డులు సాధించారు. ఆయన పలుచోట్ల జరిగిన కరాటే పోటీల్లో పాల్గొని అనేక అవార్డులు గెలుచుకున్నారు. గిన్నిస్ బుక్‌లో స్థానం సంపాదించాలనే పట్టుదలతో పని చేసి అవార్డు దక్కించుకోవడం పట్ల ఆనందం వ్యక్తం చేశాడు. ఆత్మరక్షణకు కరాటే దోహదం చేస్తుందన్నారు. గిన్నిస్ బుక్‌లో శ్రీనివాస్ చోటు సంపాదించుకోవడం పట్ల మిత్రులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.

సుప్రీంకోర్టు ప్రధాన జడ్జిపై దాడికి ఖండన

భువనగిరి టౌన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్. గవాయిపై కోర్టు హాల్‌లోనే ఓ న్యాయవాది దాడికి యత్నించడాన్ని ఖండిస్తూ సోమవారం భువనగిరిలో దళిత గిరిజన ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. దాడి చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నల్ల బ్యాడ్జిలు ధరించి నల్లటి జెండాలు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్, దళిత ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు బట్టు రామచంద్రయ్య, బండారు రవివర్ధన్, సిర్పంగి శివలింగం, దుబ్బా రామకృష్ణ, ఇటుకల దేవేందర్, రాజేష్ నాయక్, పడిగెల ప్రదీప్, శివకుమార్, డాకూరి ప్రకాశ్, గ్యాస్ చిన్న, హరిప్రసాద్, పాల్గొన్నారు.



భువనగిరిలో నిరసన తెలుపుతున్న నాయకులు

కాల్వ భూముల ఆక్రమణ

- అన్యాక్రాంతమవుతున్న ఎస్సారెస్పీ కాల్వ భూములు
- నీళ్లు వచ్చే కాల్వ తప్ప పక్కనున్న దారులన్నీ ఆక్రమణ
- రైతులు వెళ్లేందుకు దారులు లేకుండా చేసిన వైనం
- ఇబ్బందులు పడుతున్న రైతులు



భీమ్లాతండాలో కాల్వ ఇరువైపులా కబ్జా

చివ్వెంల అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఎస్సారెస్పీ కాల్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. 2006లో ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం భూమి కోల్పోయిన రైతులకు డబ్బులు చెల్లించి భూ సేకరణ చేపట్టింది. అయినప్పటికీ కాల్వల పక్కనున్న రైతులు దారులు లేకుండా ఆక్రమిస్తున్నారు. గతంలో వ్యవసాయ భూముల దగ్గరికి వెళ్లేందుకు దారులు లేక రైతులు అవస్థలు పడేవారు. ఎస్సారెస్పీ కాల్వల నుంచి 10 మీటర్ల వెడల్పు, 25 ఫీట్లతో రెండు వైపులా మట్టి రోడ్లు నిర్మించారు. దాని గుండా రైతులు ట్రాక్టర్లు, పశువులను తీసుకెళ్లేవారు. ప్రస్తుతం అవన్ని కనుమరుగై ఎక్కడికక్కడ పక్కనున్న వాళ్లు దారి లేకుండా చేశారు. 2006 సంవత్సరంలో తీసిన కాల్వలు నేడు కనిపించకుండా పోతున్నాయి. ఎనిమిది సంవత్సరాలుగా ఎస్సారెస్పీ కాల్వల ద్వారా చెరువులు నింపి పంట పొలాల నిమిత్తం వినియోగానికి నీటిని విడుదల చేస్తున్నారు. రైతులు తమ పంట పొలాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎస్సారెస్పీ కాల్వలు తవ్వాక కొన్నాళ్లు వాటి గుండా దారులు లేని రైతులు వెళ్లేవారు. రోజురోజుకు ఒకరి తర్వాత మరొకరు ఆక్రమించడంతో ప్రస్తుతం నడిచే దారి లేకపోవడం విశేషం. పొలాలకు వెళ్లేందుకు దారులు లేనివారు ఇతర రైతులను అడిగి వాళ్ల పొలాల గుండా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు.

పరిధి దాటి ఆక్రమణ

ఎస్సారెస్పీకి ఆనుకొని ఉన్న పట్టా భూములను కొందరు కొనుగోలు చేసి ఇతర రైతులు వెళ్లేందుకు వీలు లేకుండా ఆక్రమించుకుంటూ పోతున్నారు. ఎస్సారెస్పీ భూములను ఆక్రమిస్తున్నారని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూతవేటు దూరంలో ఎస్సారెస్పీ అధికారులు ఉన్నా పట్టించుకున్న నాధుడే లేడని వాపోతున్నారు. సూర్యాపేట నియోజకవర్గంలోని పెన్‌పహాడ్, ఆత్మకూర్, చివ్వెంల, కోదాడ పరిధిలోని మోతె, మునగాల, నడిగూడెం, తుంగతుర్తిలోని అర్వపల్లి, నాగారం, తుంగతుర్తి, నూతన్‌కల్ మండలాల రైతులు పలుమార్లు దారులు లేకుండా చేస్తున్నారని ఫిర్యాదులు వచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఎస్సారెస్పీ భూములు ఆక్రమణకు గురవుతున్నా నీటిపారుదల శాఖ అధికారులు మౌనం వహించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడ నియోజకవర్గాలకు చెందిన రైతులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినప్పటికీ పరిశీలిస్తామని చెప్పడంతోనే సరిపెడుతున్నారని రైతులు అంటున్నారు. అక్రమార్కులకు ఎందుకు వత్తాసు పలుకుతున్నారో అర్థం కావడం లేదని వాపోతున్నారు. కాల్వల పక్కనున్న రైతులు భూములు ఆక్రమిస్తున్నారని గతంలో అధికారులు నిర్వహించిన సర్వేలో తేలింది.

గత సెప్టెంబరు 4 నుంచి నీటి విడుదల

ఎస్సారెస్పీ కాల్వల ద్వారా గత నెల 4వ తేదీన నీటిని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు విడుదల చేశారు. కాల్వకు దూరమున్న రైతులు నీటిని తీసుకెళ్లేందుకు దారులు లేక అవస్థలు పడుతున్నారు. కొందరు రైతులు కలిసి ఒక మోటారుతో నీటిని తీసుకెళ్లేందుకు పైపులు వేసేందుకు స్థలం లేక కాల్వ తప్ప పక్కనున్న భూములు ఆక్రమిస్తున్నారరని, ఇప్పటికైనా నీటి పారుదల శాఖ అధికారులు ఆక్రమణకు గురైన భూములను గుర్తించాలని రైతులు కోరుతున్నారు.

ఆక్రమించిన భూములను వెలికితీయాలి

ఎస్సారెస్పీ భూములు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి. మేము మా పొలాల దగ్గరికి వెళాదమంటే కాల్వల పక్కనున్న రైతులు భూములన్ని ఆక్రమించారు. మాకు వెళ్లడానికి దారి లేదు. అధికారులకు తెలియజేసినా వచ్చి చూస్తామని చెబుతున్నారు. ఇంతవరకు రావట్లేదు. కాల్వలు పూడిక తీసి నీళ్ల కిందకు వెళ్లేలా చూడాలి.

● ధరావత్ భాస్కర్, రైతు భీమ్లాతండా

ఆక్రమణకు గురైన భూములను వెలికితీస్తాం

భూములు ఆక్రమణకు గురవుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ నియోజకవర్గాల పరిధిలో ఎస్సారెస్పీ కాల్వల పక్కనున్న భూములు ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటాం. కాల్వలకు నీళ్ల వదిలారు. గండ్లు పెట్టకుండా చెరువులు నింపేలా చర్యలు తీసుకుంటాం. దారులు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని మా దృష్టికి వచ్చింది.

● యాదగిరి, నీటి పారుదల శాఖ ఈఈ, సూర్యాపేట.

హలో.. ఆంధ్రజ్యోతి
మీ ప్రాంతంలో ఏ సమస్య ఉన్నా మాకు తెలియజేయండి.
ఈ కింది ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వండి..
99854 11381

చిట్యాల	9848544031	నార్కట్‌పల్లి	9030755338
చిట్యాలరూరల్	9848175649	మునుగోడు	9849732959
కట్టంగూరు	9848335106	మునుగోడ రూరల్	9440954272
నకిరేకల్	9948343318	మర్రిగూడ	9441582859
కేతేపల్లి	9849659451	నాంపల్లి	8106359347

హలో.. ఆంధ్రజ్యోతి
మీ ప్రాంతంలో ఏ సమస్య ఉన్నా మాకు తెలియజేయండి.
ఈ కింది ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వండి..

నల్లగొండ, క్రైం	9985411392	చండూరు	9652358006
నల్లగొండ టౌన్	9441848394	చండూరు రూరల్	9985826907
నల్లగొండ రూరల్	9440968311	కనగల్	9959042136
రామగిరి	9848981518	తిప్పర్తి	8897266435
నల్లగొండ కల్చరల్	9989561808	శాలిగౌరారం	9849718488

భూములు కోల్పోతున్న రైతులను ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి వీరారెడ్డి

చిట్యాల, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ట్రిపుల్‌ఆర్ నిర్మాణంలో భూముల కోల్పోతున్న రైతులకు 2013 భూసేకరణ చట్టం వర్తింపజేయాలని, మార్కెట్ రేటు కంటే మూడింతలు ఎక్కువ చెల్లించి రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. చిట్యాలలో సోమవారం నిర్వహించిన సమావేశంలో సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులను బెదిరించి భూములు తీసుకోవాలనే ప్రభుత్వ ధోరణిని సీపీఎం వ్యతిరేకిస్తుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసి వచ్చే శక్తులతో సీపీఎం కలిసి పనిచేస్తుందన్నారు. నిజాయతీగా పనిచేసే వాళ్లనే స్థానికసంస్థల ఎన్నికల్లో గెలిపించాలని, డబ్బులు, మద్యం వంటి ప్రలోబాలకు గురికావద్దని కోరారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లను సీపీఎం స్వాగతిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి బొబ్బల సుధాకర్‌రెడ్డి, నాయకులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, మల్లం మహేష్, పామునగుల్ల అచ్చాలు, ఐతరాజు నర్సింహ, కత్తుల లింగస్వామి, నెల్లికంటి నర్సింహ పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



యువ వికాసంపై అవగాహన కల్పిస్తున్న ప్రవీణ్‌కుమార్

కట్టంగూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఇంపాక్ట్ మోటివేషన్ ట్రైనర్ దెండె ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం లయన్స్ క్లబ్ ఆఫ్ కట్టంగూర్ కింగ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యువ వికాస్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ప్రతీ సబ్జెక్ట్‌ను నిత్య సాధన చేయడంతో మెరుగుపడుతారని తెలిపారు. దేశ భవిష్యత్తు యువత చేతిల్లోనే ఉందన్నారు. యువత మానసికంగా, శారీరకంగా, సామాజిక ఎదుగుదలకు యువ వికాస్ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని సాధించేందుకు పట్టుదల క్రమశిక్షణతో శ్రమించాలని సూచించారు. పఠనం, క్రీడలు, సేవా కార్యక్రమాలు నైపుణ్యాభివృద్ధి యువ వికాస్‌లో భాగమేనన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో అంబటి అంజయ్య, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు రెడ్డిపల్లి సాగర్, కల్లూరి వెంకటేశ్వర్లు, కార్యదర్శి గుడిపాటి శివప్రసాద్, కోశాధికారి రాములు, ఉపాధ్యాయులు కొలక ఆంటోని, చిన్ని శ్రీనివాస్, విఠల్, అబ్దుల్ గఫార్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ స్ఫూర్తిని అలవర్చుకోవాలి

భారత ఆహార సంస్థ డివిజనల్ మేనేజర్ సువీన్‌కుమార్



కార్మికులను, ఉద్యోగులను అభినందిస్తున్న సువీన్‌కుమార్

నల్లగొండ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ భారత్ స్ఫూర్తిని మరింతగా అలవర్చుకొని కార్యక్రమాలను కొనసాగించాలని భారత ఆహార సంస్థ నల్లగొండ డివిజన్ మేనేజర్ సువీన్ కుమార్ అన్నారు. భారత ఆహార సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబరు 14 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు స్వచ్ఛతయే సేవా కార్యక్రమాలు నిర్వహించి సోమవారం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ ఆదేశాల మేరకు సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛత ర్యాలీ నిర్వహించి పార్కులు, బహిరంగ ప్రదేశాలను శుభ్రపర్చడంతో పాటు ఆరోగ్య శిబిరాలను నిర్వహించారు. అనంతరం కార్మికులను, ఉద్యోగులను అభినందిస్తూ సన్మానించారు. ఈ కార్యక్రమంలో కెఎన్‌కే. ప్రసాద్, కృష్ణవేణి, ఆదిమల్ల శంకర్, కాశిరెడ్డి, భాస్కర్, సునంద, సరిత, స్వాతి, సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

పోషణమాసం కార్యక్రమం

చిట్యాలరూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేరడ గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం నిర్వహించారు. ప్రతి గర్భిణీ, బాలింత పౌష్టికాహారాన్ని భుజించాలని, రక్తహీనత ఏర్పడకుండా ఆకుకూరలు చిరుధాన్యాలు అధికంగా తీసుకోవాలని అన్నారు. 30 మాసాలు నిండిన చిన్నారులను తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని, వారికి ఆట-పాటలతో కూడిన విద్యాబుద్ధులు నేర్పించడమే కాకుండా పోషక విలువలున్న ఆహారాన్ని అందించబడుతుందన్నారు. ముఖ్యంగా భోజనం చేసే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని, పరిశుభ్రతను పాటిస్తూ ఆరోగ్యంపై జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం ఎ.విజయ, అంగన్‌వవాడీ టీచర్లు పి. అలివేలు మంగమ్మ, వి.సుజాత, కె.నాగరాణి, ఆశావర్కర్లు వి.సైదమ్మ, బి. వసంత, నాగమణి, ఆయాలు, చిన్నారులు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

బతుకమ్మ కుంటపై నిర్లక్ష్యం



బతుకమ్మ కుంటలో మునగని విగ్రహాలు, చెత్తా చెదారంతో ఉన్న వల్లభరావు చెరువు పరిసరాలు



- మునగని నిమజ్జనం చేసిన విగ్రహాలు
- వేసిన విగ్రహాలను తొలగించని అధికారులు
- మునిసిపల్, రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం
- తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్న భక్తులు

నల్లగొండ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని వల్లభరావు (బతుకమ్మ కుంట) చెరువులో ప్రతి సంవత్సరం వినాయక, దుర్గామాత విగ్రహాలు, బతుకమ్మలు నిమజ్జనం చేస్తుంటారు. అయితే బతుకమ్మ కుంటలో పూడిక తీయడంతో పాటు నీటిని నిల్వలు తక్కువగా ఉండటం, చెత్తాచెదారం పేరుకుపోయి ఉండటం, గుర్రపుడెక్క ఉన్న కూడా తొలగించకపోవడంతో ఆ చెరువులో నిమజ్జనం చేయడం ఇబ్బందికరంగా మారుతోంది. ఇటీవల దుర్గమా త విగ్రహాలను బతుకమ్మ కుంటలో నిమజ్జనం చేస్తే ఆ విగ్రహాలు పూర్తిగా నిమజ్జనం కాలేదు. ఒక్కో విగ్రహం సగం కూడా నీటిలో మునగకపోవడంతో భక్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ క్రేన్లను ఏర్పాటు చేసి నిమజ్జనానికి సహకరించాల్సి ఉండగా చిన్నచిన్న క్రేన్లతో చెరువు ఒడ్డుకే నీరు లేని ప్రాంతంలో నిమజ్జనం చేయడం వల్ల దేవుళ్ల విగ్రహాలు పూర్తిగా నిమజ్జనం కాలేదు. ఒక క్రేన్ మాత్రమే మొక్కుబడిగా సమకూర్చారు. మునిసిపల్ అధికారులతో పాటు రెవెన్యూశాఖ తీవ్ర నిర్లక్ష్యం చేయడం వల్లే విగ్రహాలు నిమజ్జనం కాకుండా భక్తుల మనోభావాలను దెబ్బతీసే పరిస్థితి ఏర్పడింది. ప్రతీ సంవత్సరం కూడా ఇదేవిధంగా వినాయక, దుర్గమాత విగ్రహాలు పూర్తిగా నీట మునగడం లేదు. అదేవిధంగా మహిళలు తొమ్మిది రోజుల పాటు ఘనంగా నిర్వహించుకునే బతుకమ్మ పండుగకు సంబంధించి సరిగ్గా నిమజ్జనం చేయని పరిస్థితులు ఉన్నాయి.

చెత్తాచెదారం, గుర్రపు డెక్కతో...

బతుకమ్మ చెరువులో సగభాగం గుర్రపు డెక్క ఉంది. మినీట్యాంక్ బండ్‌గా రూపాంతరం చెందాల్సిన బతుకమ్మ కుంట చెరువును కాంట్రాక్టర్లు అర్ధాంతరంగా వదిలివేశారు. దీంతో లక్షలా ది రూపాయల ప్రభుత్వ ధనం వృథా అయింది. గుర్రపు డెక్క వల్ల కూడా ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలు ఉన్నాయి. ఆహ్లాదం కొం దరు, నడక కోసం కొందరు వెళ్తుంటారు. ఆహ్లాదమనేది కనిపించని పరిస్థితులు ఉన్నాయి. నిమజ్జనం తర్వాత ఆ ప్రాంతంలో చెత్తాచెదారాన్ని తొలగించాల్సి ఉన్నా మునిసిపల్ అధికారుల నిర్లక్ష్యం వల్ల పారిశుధ్య సిబ్బందిని కేటాయించలేదు. దీంతో బతుకమ్మ కుంట చెరువు ఒడ్డున ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. గుర్రపు డెక్క ఉండటం వల్ల నీరు ఉన్నదా లేదా అనేది తెలియక చిన్న పిల్లలు చెరువులో పడే అవకాశం ఉంది. భక్తులు, స్థానికులు అనేక సార్లు బతుకమ్మ కుంటను బాగు చేయాలని కోరడం తో పాటు ఎండకాలం పూడిక తీయించాలని కోరినా పట్టించుకోలేదు. వినాయక, దుర్గామాత విగ్రహాల నిమజ్జనం సమయంలో కాల్వ నుంచి నీటిని చెరువుకు విడుదల చేసి నిమజ్జనం సక్రమంగా చూడాల్సిన అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు.

అధికారులు పట్టించుకోవాలి



అధికారులు పట్టించుకొని చెరువును అభివృద్ధి చేయాలి. ప్రతీసారి నీరు సమృద్ధిగా లేకపోవడంతో నిమజ్జనం సరిగ్గా జరగడం లేదు. ఇటీవల నిమజ్జనం కార్యక్రమం నిర్వహించినా విగ్రహాలు పూర్తిగా నీట మునగలేదు. చెత్తాచెదారం పేరుకుపోయింది. గుర్రపు డెక్కను కూడా తొలగించాలి. చెరువును అభివృద్ధి చేసినట్లయితే ఈ ప్రాంతం ఎంతగానో అభివృద్ధి చెందుతుంది. అయితే అధికారులు పట్టించుకోకపోవడంతో చెరువు ప్రాంతంలో చెత్త, చెదారం కనిపిస్తూ పారిశుధ్య సమస్యగా మారిపోయింది.

- కృష్ణయ్య, నల్లగొండ

స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలి



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతీ కార్యకర్త కష్టపడి బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నకిరేకల్ మండలం తాటికల్ గ్రామానికి చెందిన ఆయా పార్టీల కార్యకర్తలు సోమవారం చిరుమర్తి లింగయ్య సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణను అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన కేసీఆర్ మళ్లీ అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. గ్రామానికి చెందిన మొగిలి వెంకన్న, మొగిలి రావు, మునుపాటి వెంకన్న, నిమ్మల గురువయ్య, మేడి నాగరాజు, మొగిలి నాగయ్య తో పాటు పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పల్‌రెడ్డి మహేందర్‌రెడ్డి, గొర్ల వీరయ్య, పరమేష్, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో వార్షికోత్సవ పూజలు



యజ్ఞంలో పాల్గొన్న భక్తులు, గ్రామస్థులు

చిట్యాలరూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): చిట్యాల మండలం వట్టిమర్తిలో శ్రీవారిజాలవేణుగోపాలస్వామి అష్టాదశ వార్షికోత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. వేకువజామున స్వస్తివాచనం చేసి వార్షికోత్సవాలను ప్రారంభించారు. స్వామివారికి సుప్రభాత సేవతో మొదలుకొని పూజాకార్యక్రమాలు, దీక్షా కంకణధారణ, అఖండదీపారాధన, అనురారోపన చేశారు. నవకలశాభిషేకం దివ్యాలంకరణ అనంతరం అగ్నిప్రతిష్ట చేసి సుదర్శన హోమం నిర్వహించారు. హోమం కార్యక్రమంలో చిట్యాల వ్యవసాయ మార్కెట్ ఛైర్‌పర్సన్ నర్రా వినోద, ఆలయ కమిటీ ఛైర్మన్ నర్రా మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మేడబోయిన లింగయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు. ఆలయ అర్చకుడు అక్కినేపల్లి భీష్మాచార్యుల అర్చక బృందం ఆధ్వర్యంలో పూజలు, హోమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ ఛైర్మన్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏటా ఆలయ వార్షికోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించబడుతుందని భక్తులు స్వామివారిని దర్శించుకుని హోమంలో పాల్గొంటారన్నారు. ఈనెల 7వ తేదీన జరిగే స్వామివారి కల్యాణ మహోత్సవానికి గ్రామస్థులతో పాటు చుట్టుపక్కల గ్రామాల వారు కూడా పెద్దఎత్తున హాజరై స్వామివారి కృపకు పాత్రులుకావాలని ఆకాంక్షించారు.

అర్ధరాత్రి అరెస్టులు అప్రజాస్వామికం



పోలీసుల అదుపులో సీపీఎం నాయకులు

మర్రిగూడ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): బాధిత భూ నిర్వాసితులను పార్టీ నాయకులను పోలీసులు అర్ధరాత్రి అరెస్టు చేయడం అప్రజాస్వామికమని సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య, బాధితులు ఉప్పు బుచ్చప్పలు అన్నారు. సోమవారం పోలీస్‌స్టేషన్ ఆవరణంలో వాళ్లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ట్రిబుల్ ఆర్ రోడ్డు కోసం ముందస్తుగా ప్రకటించిన అలైన్‌మెంట్ ప్రకారమే ఏర్పాటు చేయాలని బాధితులు, పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ట్రిబుల్ ఆర్ రోడ్డులో భూములు కోల్పోతున్న రైతులకు మద్దతుగా హైదరాబాద్‌లో జరిగే హెచ్ఎండీఏ కార్యాలయం ఎదుట ధర్నాకు వెళ్లుతున్న వివిధ పార్టీ నాయకులను, భూ బాధితులను వెళ్లకుండా అర్ధరాత్రి పోలీసులు ఇండ్లకు వచ్చి అరెస్టు చేయడంను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ట్రిబుల్ ఆర్ రోడ్డు నిర్మాణం వల్ల సన్న చిన్నకారు రైతులు భూములు కోల్పోయి తీవ్రంగా నష్టపోతున్నారని వారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులతో అనుమతి పొందిన తరువాతనే రోడ్డు నిర్మాణం కోసం అలైన్‌మెంట్ ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. పోలీసులు బాధితులను అర్ధరాత్రి అరెస్టులు చేయడం వల్ల భయపడేది లేదని భూ బాధితులకు న్యాయం జరిగేంత వరకు తమ పార్టీ తరపున పోరాటం ఆగదన్నారు. అరెస్టు అయిన వారిలో శివశంకర్, రమేష్, యాద య్య, వెంకటయ్య, నాయకులు రామలింగాచారిలు ఉన్నారు.

నాలాలను ఆక్రమిస్తే చర్యలు తప్పవు

- మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్



అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న మునిసిపల్ సిబ్బంది

రామగిరి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): నాలాలను ఆక్రమించి కట్టడాలు చేపడితే చర్యలు తప్పవని మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ హెచ్చరించారు. పట్టణంలోని ప్రకాశం బజార్‌లో చిత్ర ఎలక్ట్రానిక్స్ పక్క వీధిలో నాలాను ఆక్రమించి చేపట్టిన గోడ నిర్మాణాన్ని సోమవారం ఆయన తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. అనంతరం కూల్చి వేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ఎవరైనా సరే నాలాలను ఆక్రమించినా, నిబంధనలకు విరుద్ధంగా భవనాలను నిర్మించినా వాటిని వెంటనే కూల్చివేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా ఎవరైనా నాలాలో ఆక్రమించి కట్టడాలు చేపడితే ఫిర్యాదు చేయాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక అధికారి కృష్ణవేణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి



రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

నల్లగొండరూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికుల రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలే సత్యనారాయణ కార్మికులకు పిలుపునిచ్చారు. పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవనంలో సోమవారం నిర్వహించిన మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో అక్టోబరు 26, 27 తేదీల్లో రెండు రోజుల పాటు మహాసభలు జరగనున్నాయని తెలిపారు. మహాసభ మొదటి రోజు జరిగే బహిరంగ సభకు కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి బహిరంగసభను జయప్రదం చేయాలని కోరారు. ఈ మహాసభకు 500మంది ప్రతినిధులు హాజరవుతారని అన్నారు. ఈ మహాసభలో గడిచిన మూడేళ్లలో చేసిన పోరాటాలను సమీక్షించుకొని భవిష్యత్తు పోరాటాలకు కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా కార్మికులకు రూ.10వేల రూపాయల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సన్నద్ధం కావాలని కార్మికులకు పిలుపునిచ్చారు. అనంతరం మధ్యాహ్న భోజన కార్మికుల రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు పానుగంటి లక్ష్మమ్మ, పోలగాని యాదమ్మ, అల్లి అనురాధ పాల్గొన్నారు.

స్థానికంలో బీజేపీ గెలుపునకు కృషి చేయాలి

చిట్యాల, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పీక వెంకన్న కోరారు. చిట్యాల పట్టణంలో సోమవారం నిర్వహించిన మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేండేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల నిర్వహించకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పొట్లపల్లి నర్సింహ, పున్న విష్ణు, ఆకుల వెంకన్న, వరికుప్పల నర్సింహ, ఊయ్యాల లింగస్వామి, గడిగల కోటేష్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

భూ యజమానుల హక్కులను కాపాడాలి

చిట్యాల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారులు పట్టాదారుల, అసైన్డ్‌దారుల హక్కులను కాపాడాలని పీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి కోరారు. పీఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు భూ యజమానులు హక్కులు కాపాడకపోతే ఆక్రమణదారులకు సహకరించినట్లే భావించాల్సి వస్తుందని పేర్కొన్నారు. చిట్యాల, శివనేనిగూడెం గ్రామాల్లో ల్యాండ్ మాఫియా భూ యజమానుల హక్కులను హరించివేస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాగిళ్ల యాదయ్య, బైరు వెంకన్న, బర్రె సంజీవ, పురం రాంబాబు, లింగస్వామి పాల్గొన్నారు.

శాలిగౌరారంలో భారీ వర్షం



శాలిగౌరారంలో కురుస్తున్న వర్షం

శాలిగౌరారం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): శాలిగౌరారంలో సోమవారం సాయంత్రం ఉరుముల మెరుపులతో భారీ వర్షం పడింది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండ దంచి కొట్టింది. సాయంత్రం ఒక్కసారిగా ఆకాశంలో నల్లటి మబ్బులు వ్యాపించి భారీ వర్షం పడటంతో వాతావరణం చల్లబడింది. శాలిగౌరారం మండల కేంద్రంలో సోమవారం సతమతం కావడంతో కురగాయలకు వచ్చిన ప్రజలు తడిసి ముద్దయ్యారు. సంతలో అకాల వర్షానికి క్రయవిక్రయాలకు తీవ్ర ఆటంకం కలిగింది.

బెల్టుషాపులపై యువత కన్నెర్ర

- *గోపలాయపల్లిలో బెల్టుషాపులకు పోస్టర్లు*
- *మద్యం అమ్మితే జరిమానా*
- *బహిరంగంగా తాగిన వారికి తగిన బుద్ధి చెబుతామని యువకుల హెచ్చరిక*

నార్కట్‌పల్లి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): బహిరంగ మద్యం అమ్మకాలపై ఆ గ్రామానికి చెందిన యువకులు కొందరు కన్నెర్ర చేశారు. అక్రమ బెల్టు షాపులతో గ్రామంలోని యువత మద్యానికి బానిసలవుతున్న తీరుపై ఆందోళనతో యుద్ధం ప్రకటించారు. గ్రామంలోని అన్ని అక్రమ బెల్టుషాపుల ముందు సోమవారం హెచ్చరిక పోస్టర్లను అంటించారు. బహిరంగంగా మద్యం అమ్మే బెల్టు షాపు నిర్వాహకులను హెచ్చరించడంతో పాటు జనసంచారం ఉన్న ప్రదేశాల్లో మద్యం సేవించిన, వీరంగం సృష్టించే మద్యపాన ప్రియులకు కూడా బుద్ధి చెప్పాలని నిర్ణయించి ఆదర్శంగా నిలుస్తున్నారు నార్కట్‌పల్లి మండలంలోని గోపలాయపల్లి గ్రామానికి చెందిన కొందరు యువకులు.

చిన్నపిల్లలకు విక్రయిస్తుండటంతో...

గ్రామంలోని కొందరు పాఠశాల స్థాయి విద్యార్థులకు కూడా బెల్టు షాపుల నిర్వాహకులు మద్యం విక్రయిస్తున్నారని గ్రామానికి చెందిన యువకులు గుర్తించారు. పైగా సదరు బెల్టు షాపుల నిర్వాహకులు ఉద్దెర కూడా ఇస్తుండటంతో ప్రతీ రోజూ మద్యం తాగుతూ చిన్న వయసులోనే చెడు అలవాట్లకు బానిసలవుతున్నట్లు గ్రహించారు. మద్యం మత్తులో అసాంఘిక, అశ్లీల కార్యకలాపాలకు పాల్పడుతున్న సంఘటనలతో బాధిత తల్లిదండ్రులు కూడా తీవ్ర మనోవేదన చెం దుతున్న పరిస్థితులపై బీజేపీ యువ నాయకుడు యాట చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సుమారు 8 మంది యువకులు బహిరంగ మద్యం అమ్మకాలను కొంత మేరకైనా నియంత్రించాలని సంకల్పించారు. ఇందుకోసం రూపొందించిన కార్యాచరణను విజయ దశమి తర్వాత అమలు చేయాలని నిర్ణయించారు. అనుకున్న ప్రకారం సోమవారం రాత్రి గ్రామంలోని మద్యం అమ్మకాలు చేసే సుమారు 9 బెల్టు షాపుల గోడలపై హెచ్చరిక పోస్టర్లను అంటించారు.



గ్రామ యువకులు రూపొందించిన పోస్టర్

బహిరంగంగా విక్రయిస్తే...


అబ్కారీ నిబంధనలను ఉల్లంఘించి తక్కువ వయసున్న పిల్లలకు మద్యం విక్రయిస్తే బెల్టు షాపుల వారిపై కఠినంగా వ్యవహరించాలని, వారి షాపుల్లో ఉండే మద్యం నిల్వలను బాధిత కుటుంబాల మహిళల సమక్షంలో ధ్వంసం చేస్తామని అవసరమైతే గ్రామస్థుల సూచనలతో జరిమానా విధిస్తామని అబ్కారీ అధికారులకు కూడా ఫిర్యాదు చేస్తామని హెచ్చరిస్తున్నారు. కేవలం మద్యం అమ్మే బెల్టు షాపుల నిర్వాహకులనే కాకుండా జనసంచారం ఉండే బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి అసభ్యంగా ప్రవర్తించే వారిపైనా కఠినంగా వ్యవహరిస్తామని వారికి కౌన్సెలింగ్ తగిన బుద్ధి చెప్పాలని అనుకుంటున్నారు.

గ్రామస్తులు సహకరించాలి



గ్రామంలో అందుబాటులో దొరికే మద్యం, మత్తు పదార్థాలకు బానిసలై గ్రామంలోని యువత పెడదారిపడుతున్న తీరుపై ఆవేదన, ఆందోళనతోనే మేం తీసుకున్న నిర్ణయానికి గ్రామస్థులు సహకరించాలని కోరుకుంటున్నా. బెల్టు షాపుల్లో నిబంధనలు ఉల్లంఘించి చిన్నవయసు వారికి కూడా మద్యం విక్రయిస్తున్నారు. దీంతో చిన్నవయసులోనే మద్యానికి, మత్తు పదార్థాలకు బానిసలై చెడు అలవాట్లకు యువత బానిసలవుతున్న పరిస్థితులను కొంతైనా మార్పు చేయాలనే సంకల్పంతో మేం తీసుకున్న నిర్ణయాలను స్వాగతించాలని కోరుతున్నా.

- యాట చంద్రశేఖర్, యువకుడు



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	588 (306.1010)	53,087	56,398
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.15 (4.24)	7,137.78	6,060.91
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.342 (44.7433)	37,552	37,552

చికెన్ ధరలు | లైవ్ : రూ.130 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.230

ఆర్టీసీకి దసరా జోష్

- అదనంగా రూ.1.65కోట్ల ఆదాయం
- ఆర్జనలో సూర్యాపేట డిపో తొలి స్థానంలో

ఉమ్మడి జిల్లాలో ఆర్టీసీ రీజియన్ పరిధిలోని ఏడు డిపోలకు దసరా పండుగ సెలవులు అదనపు ఆదాయాన్ని సమకూర్చాయి. రాష్ట్రంలో ప్రధాన పండుగల్లో బతుకమ్మ, దసరా కావడంతో ప్రజలు పెద్ద సంఖ్యలో పట్టణాల నుంచి స్వగ్రామాలకు ఆర్టీసీ బస్సుల్లో తరలివెళ్లారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం కావడం, ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పండుగ సందర్భంగా మహిళలు అధిక సంఖ్యలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. మహిళల ఉచిత ప్రయాణానికి ప్రభుత్వం ఆర్టీసీకి రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తోంది.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

దసరా సందర్భంగా హైదరాబాద్, పట్టణాల నుంచి పల్లెలకు, స్వగ్రామాలకు వెళ్లేందుకు సుమారు 15 రోజుల పాటు ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీలను నడిపింది. పండుగ రద్దీకి తగట్టు ఆర్టీసీ మొత్తం 597 ప్రత్యేక సర్వీసులు నడిసింది. ఇక సెలవులు ముగియడంతో ఆది, సోమవారాల్లో రీజియన్ పరిధిలోని అన్ని బస్టాండ్లు ప్రయాణికులతో కిటకిటలాడాయి.

రూ. 1.65కోట్లకుపైగా ఆదాయం

ఆర్టీసీ దసరా పండుగకు ప్రత్యేక బస్సులు నడపడంతో అదనంగా రూ.1,65,78,605 ఆదా యం సమకూరింది. పండుగ సెలవులు దృష్టి లో పెట్టుకొని ఏడు డిపోల పరిధిలో 33,99,80 4 కి.మీ మేర బస్సులు తిరిగాయి. అత్యధికంగా సూర్యాపేట డిపోకు రూ.47,17,165 అదనపు ఆదాయం సమకూరగా, రూ.33, 78,701 ఆదాయంతో యాదగిరిగుట్ట డిపో రెండో స్థానంలో నిలిచిం ది. మూడో స్థానంలో మిర్యాలగూడ డి పో నిలవగా, రూ.23,19,230 ఆదాయం సమకూరింది. దసరా, బతుకమ్మ నేపథ్యంలో ఆర్టీసీ ప్రణాళికా బద్ధంగా ప్రత్యేకంగా బస్సు సర్వీసు లు నడిపింది. ఇక పండుగలను మినహాయిస్తే ఉమ్మడి జిల్లాలో ఏడు డిపోల పరిధిలో ప్రతీ రోజు 680 బస్సులు నిత్యం పలు రూట్లలో 2.60లక్షల కి.మీలు ప్రయాణిస్తాయి. అందుకు సంస్థకు ప్రతీ రోజు రూ.1.50కోట్ల ఆదాయం సమకూరుతోంది. ఈ ఆదాయం కాకుండా పండుగ సెలవుల్లో ఆర్టీసీకి అదనంగా రూ.1.65 కోట్లకు పైగా ఆదాయం సమకూరింది. పండుగ సెలవుల్లో డిమాండ్‌కు అనుగుణంగా ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ప్రయాణికులను వారి గమ్యస్థానాలను చేర్చేందుకు ఎలక్ట్రికల్ బస్సులు కూడా నడిపింది.





ప్రజలకు మెరుగైన ప్రయాణాన్ని కల్పించాం

దసరా, బతుకమ్మ పండుగలను పురస్కరించుకొని సెలవుల్లో పెద్ద సంఖ్యలో బస్సు సర్వీసులను నడిపించాం. రీజియన్ మొత్తం 597 అదనపు బస్సులు తిప్పడం ద్వారా ఆర్టీసీకి రూ.1,65,605 అదనపు ఆదాయం సమకూరింది. ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణంతో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పించాం. డిమాండ్‌కు అనుగుణంగా అన్ని రూట్లలో బస్సులు నడిపి చర్యలు తీసుకున్నాం. మహిళా ప్రయాణికులకు అసౌకర్యం లేకుండా బస్సులు నడిపాం. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలకు బస్సు సర్వీసులు అధిక సంఖ్యలో నడిపించాం.

- కె.జానిరెడ్డి, ఆర్ఎం నల్లగొండ

రీజియన్ పరిధిలో దసరాలో బస్సుల సంఖ్య, ఆదాయం ఇలా..

డిపో	నడిచిన బస్సులు	తిరిగిన కి.మీలు	అదనపు ఆదాయం
దేవరకొండ	60	5,40,020	14,95,942
కోదాడ	92	4,20,051	21,55,178
మిర్యాలగూడ	69	5,19,777	23,19,230
నల్లగొండ	65	6,20,113	9,63,574
నార్కట్‌పల్లి	48	93,362	15,48,815
సూర్యాపేట	130	7,37,994	47,17,165
యాదగిరిగుట్ట	133	4,68,487	33,78,701
మొత్తం	597	33,99,804	1,65,78,605

రయ్.. రయ్‌మంటూ..



హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై యదాద్రి జిల్లా చౌటుప్పల్ వద్ద వాహనాల రద్దీ

- హైవేపై కొనసాగుతున్న రద్దీ
- 27 కిలోమీటర్ల ప్రయాణానికి రెండు గంటలు
- వాహనాలతో చౌటుప్పల్ దిగ్బంధనం

4

ఇసుకేస్తే రాలనంత రద్దీ. బండెనక బండె కట్టి వేలాది బండ్లు కట్టిన తీరున సోమవారం కూడా జాతీయ రహదారి రద్దీగా కన్పించింది. అడుగుకో వాహనంతో ఇటు ప్రయాణికులు, అటు వాహనదారులు ఆగమాగమయ్యారు. ఇక ద్విచక్రవాహనదారుల పరిస్థితి దయనీయం. అటు ఎండతాపం, ఇటు వాహనాల వేడి, కాలుష్యానికి ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఎండలకు చిన్నపిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడ్డారు. ఇక జాతీయ రహదారులపై హోటళ్లు, రెస్టారెంట్లు రద్దీగా మారాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని చౌటుప్పల్‌లో వాహనాల రద్దీ కన్పించగా, బీబీనగర్, కేతేపల్లి మండలాల పరిధిలోని టోల్ గేట్ల వద్ద వాహనాల రద్దీ సాధారణంగా ఉంది.

అప్పటి వరకు రావొద్దు



ప్రైవేట్ పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ స్కీమ్ (బీఏఎస్)ను ప్రవేశపెట్టింది. విద్యలో ప్రతిభ కనబర్చిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు బీఏఎస్ కింద ఎంపికైన పాఠశాలల్లో చదువుకునే వీలు కల్పించింది. విద్యార్థుల ఫీజును ఉపకార వేతనాలుగా ప్రైవేట్ పాఠశాలలకు చెల్లించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. కాగా, బీఏఎస్‌లో సీటు సాధించి ప్రైవేట్ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు, ప్రభుత్వం మూడేళ్లుగా ఉపకారవేతనాలు చెల్లించడం లేదు. దీంతో యాజమాన్యాలు ఆందోళనబాటపట్టాయి. అంతేగాక ఉపకారవేతనాలు వచ్చేంతవరకు పాఠశాలకు రావొద్దని యాజమాన్యాలు చెబుతున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి,కోదాడ)

- బీఏఎస్ స్కీం పాఠశాలలకు అందని ఉపకార వేతనాలు
- మంజూరయ్యేంతవరకు విద్యార్థులను రావొద్దంటున్న యాజమాన్యాలు
- ప్రభుత్వం రూ.25 కోట్ల మేర బకాయి

ఉమ్మడి జిల్లాలో 18 ప్రైవేట్ పాఠశాలలు బీఏఎస్ కింద ఎంపికయ్యాయి. ఆయా పాఠశాలల్లో 2,700 మంది విద్యార్థులు 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యనభ్యసిస్తున్నా రు. వీరికి సంబంధించి మూడేళ్లుగా ఉపకారవేతన బకాయిలు రూ.25కోట్లు ప్రైవేట్ పాఠశాల ల యాజమాన్యాలకు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. ఉపకార వేతనాలు విడుదల కాకపోవటంతో బీఏఎస్ పాఠశాలల యాజమాన్యాలు బంద్‌కు సిద్ధమయ్యాయి. అందులో భాగంగా సోమవారం పాఠశాలల బంద్‌ను పాటించాయి. దీంతో విద్యార్థులు దసరా సెలవుల అనంతరం పాఠశాలకు వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది. విద్యకు దూరంకావాల్సిన పరిస్థితి నెలకొందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఉపకారవేతనాలు విడుదల చేయకపోవడంతో ఉపాధ్యాయులకు వేతనాలు, విద్యార్థులకు భోజనం,వసతి సదుపాయాలు కల్పించలేకపోతున్నామని బీఏఎస్ పాఠశాలల యాజమాన్యాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఉపకారవేతనాలు రాకపోవడంతో విద్యార్థులను పాఠశాలలకు అనుమతించడంలేదని, తల్లిదండ్రులు సహకరించాలని యాజమాన్యాలు కోరుతున్నాయి. ప్రభుత్వం బకాయిలు విడుదల చేసి, విద్యార్థులు చదువుకునే వీలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నాయి.

హాస్టల్ విద్యార్థికి రూ.42వేలు వ్యయం



ఉమ్మడి జిల్లాలో 18 బీఏఎస్ పాఠశాలలు ఉండగా, వాటిలో 2,700 మంది విద్యార్థులు చదువుతున్నారు. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు చదివే ఒక్కో విద్యార్థికి డేస్కాలర్ కింద పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫామ్స్, రవాణ ఖర్చులకు రూ.27వేలు, 6వ తరగతి నుంచి 10 వరకు చదివే హాస్టల్ విద్యార్థికి పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫామ్స్‌తో పాటు, భోజనం కింద రూ.42,000 ఉపకార వేతనంగా ప్రభుత్వం చెల్లిస్తోంది. దీని ప్రకారం 2,700 మంది విద్యార్థులకు 2022-23, 2023-24, 2024-2025 విద్యా సంవత్సరాలకు

- మిగతా 5వ పేజీలో...

బకాయిలు విడుదల కాకపోవడంతోనే బంద్...

ప్రభుత్వం ఏటా ఏప్రిల్‌లో బీఏఎస్ పాఠశాలల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేస్తోంది. మే నాటికి ప్రవేశాల ప్రక్రియ పూర్తవుతుంది. సీటు సాధించిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు జూన్ నుంచి పాఠశాలలకు హాజరవుతారు. అంత వరకు బాగానే ఉన్న మూడేళ్లుగా ప్రభుత్వం విద్యార్థులకు సంబంధించిన బకాయిలు విడుదల చేయడంలేదు. దీంతో విద్యార్థులకు బుక్స్‌తోపాటు, భోజనం, ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించడం కష్టంగా మారింది. ఒక్కో పాఠశాలకు ప్రభుత్వం రూ.1.50కోట్లకుపైగా బకాయిలు చెల్లించాల్సి ఉంది. అప్పు తెచ్చి పాఠశాలలు నడపాలంటే భారంగా ఉంది. వడ్డీలు చెల్లించలేకపోతున్నాం. బకాయిలపై రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించినా ఫలితంలేకపోవడంతోనే రాష్ట్ర వ్యాప్తంగా 210 బీఏఎస్ పాఠశాలలు బంద్‌బాట పట్టాల్సి వచ్చింది. ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించి బకాయిలు విడుదల చేసి, రాష్ట్ర వ్యాప్తంగా బీఏఎస్ పాఠశాలలో చదువుతున్న 30వేల మంది విద్యార్థులతోపాటు, ఉమ్మడి జిల్లాలోని 2,700 మంది విద్యార్థుల విద్యకు ఆటంకం, యాజమాన్యాలపై భారంగా లేకుండా చూడాలి.

- లింగారెడ్డి, బీఏఎస్ పాఠశాలల యాజమాన్యాల సంఘం రాష్ట్ర కన్వీనర్

తరగతి గదుల నిర్మాణం పూర్తిచేయాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

త్రిపురారం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అదనపు తరగతి గదుల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని, క్రీడామైదానాన్ని అభివృద్ధి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలోని గిరిజన బాలికల సంక్షేమ మినీ గురుకుల పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వసతి సౌకర్యాలు తెలుసుకొని అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించారు. అదనపు తరగతి గదులు, క్రీడామైదానం అభివృద్ధికి సత్వర చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరుపులు లేక నేలపై పడుకుంటున్నామని విద్యార్థులు తెలపగా, వెనువెంటనే జిల్లా కేంద్రం నుంచి పంపిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఫార్మసీలో అందుబాటులో ఉన్న మందులను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. అధికారులు విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించవద్దని హెచ్చరించారు. కార్యక్రమాల్లో సబ్‌కలెక్టర్ అమిత్ నారాయణ్, గృహనిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, ప్రిన్సిపాల్ భారతి, తహసీల్దార్ ప్రమీల, ఎంపీడీవో విజయలక్ష్మి, వైద్యుడు సంజయ్‌సాహు, ఉన్నారు.

బీఏఎస్ విద్యార్థుల సమస్యలు తీర్చాలి

కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగార్జున



కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

నల్లగొండ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): బెస్ట్ అవెలబుల్ స్కూల్ (బీఏఎస్) విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం సమస్యలను కలెక్టర్ ఇలా త్రిపాఠి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్సీ ఎస్టీ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించాలనే లక్ష్యంతో బీఏఎస్‌ను ప్రారంభించగా, మూడేళ్లుగా పాఠశాలలకు పెండింగ్ ఉపకార వేతనాలు విడుదల చేయడం లేదన్నారు. దీంతో వేలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 20,038 పాఠశాలల్లో 23వేల మంది ఎస్సీ విద్యార్థులు, 7వేల మంది ఎస్టీ విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ నాయకులు కార్తీక్, మామిడి జగన్, స్వామి, గాదె నర్సింహ, శోభన్, పెరుమాళ్ల సాహితీ, అరుణ, రాజేశ్వరీ, లక్ష్మీ, సోమని, శ్యామ్, నరేష్, నామ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిధులను విడుదల చేయాలి

ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ స్కీమ్ నిధులకు వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్ డిమాండ్ చేశారు. సోమవారం నల్లగొండలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ బెస్ట్ అవైబుల్ స్కీమ్ కింద చదువుతున్న విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని ఆరోపించారు. జిల్లాకు చెందిన మంత్రి కేవలం 15 రోజుల్లో డబ్బులు ఇప్పిస్తానని చెప్పి రెండు నెలలైనా విడుదల కాలేదన్నారు. నిధుల మంజూరుకు పోరాటానికి విద్యార్థులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

నల్లగొండరూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల ఔట్‌సోర్సింగ్ నాన్ టీచింగ్ ఉద్యోగుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ డిమాండ్ చేశా రు. సోమవారం ఈ మేరకు అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో 14 సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయన్నారు. వాటిలో వాచ్‌మెన్, అటెండర్, ఎలక్ట్రీషియన్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఐసీటీ కేటగిరీల్లో పాఠశాలకు ఐదుగురు చొప్పున 70 మంది విధులు నిర్వహిస్తున్నారన్నారు. వీరికి ఆరు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే నిరవధిక సమ్మె తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి పెరుమాళ్ల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం తప్పని తిప్పలు

వర్షంతో పోలీస్‌స్టేషన్‌లో తలదాచుకున్న రైతులు



టోకెన్ల కోసం తెల్లవారుజాము నుంచే వేచి ఉన్న రైతులు

తిరుమలగిరి(సాగర్), అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): సకాలంలో యూరియా అందకపోవడంతో రైతులకు తిప్పలు తప్పడం లేదు. దసరా పండుగ ముందు నుంచి సుమారు వారం రోజులుగా మండలానికి యూరియా దిగుమతి లేదు. దీంతో సోమవారం ఉదయం అధికారులు యూరియాను పంపిణీ చేస్తారన్న సమాచారంతో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన రైతులు మండల కేంద్రానికి వచ్చారు. వ్యవసాయ మార్కెట్‌యార్డులోని గోదాం వద్దకు సోమవారం అర్ధరాత్రి దాటాక చేరుకొని పడిగాపులు కాశారు. యూరియా కోసం రైతులు రాగా, అదే క్రమంలో భారీ వర్షం కురిసింది. గత్యంతరం లేక రైతులు సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో తలదాచుకున్నారు. వర్షం తగ్గాక తెల్లవారుజామున గోదాం వద్దకు చేరుకున్నారు. గోదాం వద్ద పెద్ద సంఖ్యలో రైతులు గుమికూడడంతో క్యూలో నిలబెట్టేందుకు పోలీసులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. అనంతరం రైతుల నుంచి ఆధార్‌కార్డులు, పట్టాదారు పాస్‌పుస్తకాలు తీసుకోని పీఏసీఎస్, వ్యవసాయశాఖ సిబ్బంది వచ్చాక టోకెన్లు ఇచ్చారు. సోమవారం 20 మెట్రిక్ టన్నుల యూరియా రాగా, రైతులు పెద్ద సంఖ్యలో రావడంతో టోకెన్లు కొందరికే లభించగా, మిగతా రైతులు ఉసూరుమంటు తిరిగివెళ్లిపోయారు.

విద్యార్థుల హాజరును నూరుశాతం పెంచాలి

డీఈవో భిక్షపతి

గుర్రంపోడ్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సెలవుల అనంతరం విద్యార్థుల హాజరును రెండు రోజుల్లో నూరుశాతానికి పెంచేలా కృషి చేయాలని జిల్లా విద్యాధికారి బి.భిక్షపతి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కేజీబీవీ, పిట్టలగూడెం ప్రాథమిక, ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీచేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేజీబీవీలో సెలవులకు ఇంటికి వెళ్లిన విద్యార్థినులను రప్పించేలా తల్లిదండ్రులతో మాట్లాడి హాజరుశాతం పెంచాలని సూచించారు. పాఠశాల ఆవరణ, మరుగుదొడ్లు, వంటగదులను శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. గ్రామాల్లో 14 ఏళ్ల నిండి ఏ కారణంతోనైనా బడి మానివేసిన వారిని గుర్తించి ఓపెన్ టెన్త్‌లో చేర్పించేలా ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కేజీబీవీలో వంట గది, స్టోర్‌రూమ్‌ను పరిశీలించి ఎస్‌వో విజయశ్రీకి పలు సూచనలు చేశారు.

ఆంధ్రజ్యోతి సదా మీ సేవలో...
అచిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా !
పత్రికా పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా మాకు ఫోన్ చేసి చెప్పవచ్చును. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా వుంటారు.
సంప్రదించగలరు :
మిర్యాలగూడ, దేవరకొండ, హాలియా
ACM - 9985411394
Miryalguda ACO- 9963624250, Miryalguda SR - 9542690885,
Devarkonda SR - 9392062350, Haliya SR - 9885226544,

మీ ప్రాంతంలో ఏ సమస్య ఉన్నా మాకు తెలియజేయండి.
ఈ కింది ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వండి..
99854 11381

మిర్యాలగూడ రూరల్	8498853326	హాలియా	9177656620
నాగార్జునసాగర్	6300061840	త్రిపురారం	9515375401
గుర్రంపోడు	8464850954	తిరుమలగిరిసాగర్	9866862208
నిడమనూరు	9492608256	మిర్యాలగూడ టౌన్	9866192599
పెద్దవూర	9963164401	మిర్యాలగూడ అర్బన్	9849711782

మీ ప్రాంతంలో ఏ సమస్య ఉన్నా మాకు తెలియజేయండి.
ఈ కింది ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వండి..

దేవరకొండ	9985411402	కొండమల్లేపల్లి	9948248389
పెద్దఅడిశర్లపల్లి	9440949965	మిర్యాలగూడ	9985411042
చింతపల్లి	9441950290	మాడ్గులపల్లి	9000340608
డిండి	9398897933	వేములపల్లి	9052325491
నేరేడుగొమ్ము	9666332124	దామరచర్ల	9441930773

బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

● కిటకిటలాడిన ప్రయాణికుల ప్రాంగణాలు ● సెలవులు ముగియడంతో తిరుగుబాట



కొండమల్లేపల్లిలో ప్రయాణికులతో నిండిన బస్టాండ్

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): దసరా సెలవులు ముగియడంతో తిరిగిబాట పట్టిన ప్రయాణికులతో మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్ కిటకిటలాడింది. సోమవారం తెల్లవారుజాము నుంచే ప్రజలు బస్టాండ్‌కు క్యూ కట్టారు. అన్ని రూట్లలో తిరిగే బస్సులన్నీ రద్దీగా కనిపించాయి. పట్టణం నుంచి ప్రధానంగా హైదరాబాద్, విజయవాడ, దేవరకొండ వైపునకు వెళ్లే బస్సులన్నీ కిక్కిరిసిపోగా, ప్రయాణికులు గంటల కొలదీ వేచిచూశారు. మరోవైపు ప్రైవేటు రవాణా వాహనాలకు డిమాండ్ బాగా పెరిగింది. పట్టణంలోని ప్రధాన కూడళ్ల నుంచి హైదరాబాద్‌కు కార్లను ఏర్పాటు చేశారు. సాధారణ రోజుల్లో నాలుగైదు కార్లు ప్రయాణికులు తరలించేవి. అది, సోమవారాల్లో ముప్పై కార్లు మిర్యాలగూడ - హైదరాబాద్‌కు ట్రిప్పులు వేశాయి.

ప్రత్యేక బస్సుల పేరుతో...

ఆదాయ మార్గాల అన్వేషణలో ప్రథమస్థానంలో ఉండే ఆర్టీసీ సంస్థ దసరా సందర్భంగా ప్రత్యేక బస్సుల పేరుతో అదనపు చార్జీలు వసూలు చేస్తోందని ప్రయాణికులు వాపోయారు. హైదరాబాద్ టికెట్ ధర సాధారణ రోజుల్లో రూ.310 ఉండగా, స్పెషల్ బస్సుల పేరుతో రూ. 450 వసూలు చేసినట్లు తెలిపారు. ఇతర రూట్లలోనూ చార్జీల ధరలు అమాంతం పెంచారని ప్రయాణికులు వాపోతున్నారు.

పల్లెవెలుగు, ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సులకు స్పెషల్ అంటూ


మిర్యాలగూడలో ప్రయాణికులు


మిర్యాలగూడలో ప్రయాణికులతో రద్దీగా ఉన్న బస్టాండ్

స్టిక్కర్లు వేశారని, పల్లెలకు వెళ్లే బస్సుల ను రద్దు చేసి రద్దీ రూట్లకు మళ్లించారని పలువురు ప్రయాణికులు ఆరోపించారు.

రద్దీగా మారిన మాల్ బస్టాండ్ ప్రాంగణం

చింతపల్లి: దసరా పండుగ పూర్తి చేసుకొని తిరిగి పల్లెల నుంచి పట్టణాలకు ప్రయాణికులు తరలివెళ్తున్నారు. మూడు జిల్లాల కూడలి ప్రముఖ విద్యావ్యాపార కేంద్రంగా దినదినాభివృద్ధి చెందుతున్న వీటీ నగర్ (మాల్) బస్టాండ్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లాల్సిన పరిస్థితి. ఆర్టీసీ అధికారులు ఇదే అదునుగా భావించి ప్రయాణికుల నుంచి బస్సు చార్జీలు పెంచి వసూళ్లు చేస్తున్నారు. మామూలుగా మాల్ నుంచి రూ.80 టికెట్ ధర ఉంటే దసరా నుంచి రూ. 120 టికెట్ చార్జీ పెంచి వసూళ్లు చేస్తున్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సులో ప్రవేశం కల్పిస్తే మరో పక్క సామాన్య ప్రజల నుంచి అదనంగా వసూళ్లు చేస్తుండటంతో ఆర్థికంగా నష్టపోతున్నామని ప్రజలు వాపోయారు. రంగారెడ్డి జిల్లా మాడ్గుల్ మండలంతో పాటు పలు గ్రామాల నుంచి ప్రయాణికులు మాల్ బస్టాండ్‌కు చేరుకొని హైదరాబాద్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. దీంతో బస్టాండ్ ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది.

బాక్సింగ్ పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో బాలు

మిర్యాలగూడటౌన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాక్సింగ్ పోటీలను జిల్లా కార్యదర్శి దగ్గుబాటి విమల, ఎంఈవో లావూరి బాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా విమల మాట్లాడుతూ పాఠశాల విద్యాశాఖ ఆదేశానుసారం అండర్ 14, 17 విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడాసక్తిని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు తమకు ఇష్టమైన క్రీడలను సాధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్‌ఏ కోచ్ రవీందర్, ఎస్‌జీఎఫ్ నియోజకవర్గ కన్వీనర్ శోభారాణి, పీడీ వంగ సైదులు, సావిత్రి, శ్రీనివాసరెడ్డి, సురేందర్‌రెడ్డి, అహ్మద్ పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ లీగ్ పోటీలు



విజయోత్సవంలో క్లియో జట్టు క్రీడాకారులు

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని క్లియో స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన దసరా క్రికెట్ లీగ్ పోటీలు ముగిశాయి. ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో 22 జట్లు పాల్గొన్నాయని కోచ్ కావలి వెంకన్న తెలిపారు. క్లియో, సూర్యాపేట జట్ల మధ్య ఉత్కంఠగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో పట్టణానికి చెందిన క్లియో జట్టు ఘనవిజయం సాధించింది. ఆల్‌రౌండర్ ప్రతిభ కనబర్చిన ధీరజ్ రామస్వామి, బెస్ట్ బ్యాట్స్‌మెన్ మంజునాథ్, బెస్ట్ బౌలర్ ఈశ్వర్, ఫీల్డర్ సాదిక్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ డోలా కృష్ణలను అభిమానుల మధ్య అభినందించారు. కార్యక్రమంలో రామకృష్ణ, అనుదీప్, మస్తాన్, సాయికృష్ణ, జవహర్‌లాల్, జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలను నిర్లక్ష్యం చేస్తున్న శిక్షకులు

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లా స్పోర్ట్స్ అథారిటీ నియమించిన కోచ్‌లు క్రీడలను, క్రీడాకారులను నిర్లక్ష్యం చేస్తున్నారని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకుడు రామ్మోహనాచారి ఆరోపించారు. పట్టణంలోని ఎన్నెస్పీ క్యాంపులో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ స్టేడియాలు, మైదానాలను నిర్లక్ష్యం చేస్తూ, ప్రైవేట్ క్రీడా సంస్థల అభివృద్ధికి కృషి చేస్తున్నారని ఆరోపించారు. సర్కారు బడుల లో అభ్యసించే విద్యార్థుల్లో ప్రతిభ కలిగిన వారున్నా శిక్షణ అందక వెనుకబడి ఉన్నారని పేర్కొన్నారు. క్రీడాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న పథకాలు, అందిస్తున్న ఫలాలు అందరికీ అందేలాగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

భూములు కోల్పోతున్న రైతులను ఆదుకోవాలి

చిట్యాల, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ట్రిపుల్‌ఆర్ నిర్మాణంలో భూముల కోల్పోతున్న రైతులకు 2013 భూసేకరణ చట్టం వర్తింపజేయాలని, మార్కెట్ రేటు కంటే మూడింతలు ఎక్కువ చెల్లించి రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. చిట్యాలలో సోమవారం నిర్వహించిన సమావేశంలో సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులను బెదిరించి భూములు తీసుకోవాలనే ప్రభుత్వ ధోరణిని సీపీఎం వ్యతిరేకిస్తుందని ఆయన అన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

● ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు తెలుపుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాల ని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ కోరారు. దేవరకొండ పట్టణంలోని ఆయన నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన దేవరకొండ, నేరేడుగొమ్ము, చందంపేట, డిండి మండలాల కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రిజర్వేషన్లపై అపో హలు నమ్మవద్దని, అధిష్ఠానం నిలబెట్టిన అభ్యర్థిని గెలిపించాలన్నా రు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కొత్త, పాత తేడా లేకుండా గెలుపే ల క్ష్యంగా పనిచేయాలని, అభ్యర్థుల ఎంపిక పారదర్శకంగా ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన కార్యకర్తలకే పదవులు వస్తాయని అన్నారు. పార్టీ సూచించిన అభ్యర్థిని గెలిపించుకోవాలన్నారు. ఈ సమావేశంలో దేవరకొండ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నా యకులు నాయిని మాధవ రెడ్డి, వడ్త్య దేవేందర్‌నాయక్, హనుమంతు వెంకటేష్‌గౌడ్, జాన్‌యాదవ్, సురేష్‌గౌడ్, సర్వయ్య, శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ వేణుధర్‌రెడ్డి, రాంసింగ్, కొర్ర రవి తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


వినూత్న వేషధారణలో ప్రచారం నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు ప్రభాకర్

వేములపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): యువత మాదకద్రవ్యాల బారిన పడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ప్రభుత్వ ఉపాధ్యాయుడు వినూత్న ప్రచారం చేస్తున్నాడు. సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం గోరుట్ల జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న రాచకొండ ప్రభాకర్ సోమవారం మండలంలోని సల్కునూరు ఎక్స్‌రోడ్డు వద్ద మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా వినూత్న రీతిలో ప్రచారం చేశారు. యువతకు అవగాహన కల్పించారు. నేటి యువత మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల బారినపడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూనే జాతర, ఉత్సవాలు, వారంత సంతలో రద్దీగా ఉన్న ప్రాంతాల్లో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నానని ఆయన తెలిపారు. మద్యపానం, ధూమపానం ఆరోగ్యానికి హానికరమని, డ్రగ్స్ వద్దు ప్రాణమే ముద్దు, సేవ్ లైఫ్ అంటూ కరపత్రాలను పంచుతూ మైక్ పట్టుకొని విచిత్ర వేషధారణలతో ప్రచారం చేస్తున్నాడు. ఒక వైపు జిల్లాలోనే కాకుండా దసరా సెలవుల్లో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో బైక్ యాత్రను నిర్వహించి యువతకు తనవంతుగా సందేశం అందిస్తున్నానని సామాజిక కార్యకర్త, ప్రభుత్వ ఉపాధ్యాయుడు ప్రభాకర్ తెలిపారు.

గుడిపల్లి ఏవోగా రాజు

పెద్దఅడిశర్లపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పడిన గుడిపల్లి మండలానికి వ్యవసాయ అధికారిగా పసుల రాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన జనగాం జిల్లా బచ్చనపేట మండలం ఏఏవో పనిచేస్తూ పదోన్నతిలో బదిలీపై గుడిపల్లి మండలానికి వ్యవసాయ అధికారిగా వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని రైతులందరికీ అన్ని వేళల సేవలందిస్తానని తెలిపారు. రైతులు వ్యవసాయ సంబంధిత విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకుని అధిగ దిగుబడులను సాధించుకోవాలని తెలిపారు. పలువురు ఏఏవోలు వ్యవసాయ అధికారి పసుల రాజును మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

నల్లగొండరూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికుల రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలే స త్యనారాయణ కార్మికులకు పిలుపునిచ్చారు. పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవనంలో సోమవారం నిర్వహించిన మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశంలో ఆయన మా ట్లాడారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో అక్టోబరు 26, 27 తేదీల్లో రెండు రోజుల పాటు మహాసభలు జరగనున్నాయని తెలిపారు. మహాసభ మొదటి రోజు జరిగే బహిరంగ సభకు కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి బహిరంగసభను జయప్రదం చేయాలని కోరారు. ఈ మహాసభకు 500మంది ప్రతినిధులు హాజరవుతారని అన్నారు. ఈ మహాసభలో గడిచిన మూడేళ్లలో చేసిన పోరాటాలను సమీక్షించుకొని భవిష్యత్తు పోరాటాలకు కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా కార్మికులకు రూ.10వేల రూపాయల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సన్నద్ధం కావాలని కార్మికులకు పిలుపునిచ్చారు. అనంతరం మధ్యాహ్న భోజన కార్మికుల రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు పానుగంటి లక్ష్మమ్మ, పోలగాని యాదమ్మ, అల్లి అనురాధ పాల్గొన్నారు.

దేవరకొండ డివిజన్‌లో కురిసిన వర్షం

● ఆందోళనలో పత్తి రైతులు


దేవరకొండలో కురుస్తున్న వర్షం

దేవరకొండ, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): దేవరకొండ డివిజన్‌లో సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దేవరకొండ పట్టణంతో పాటు కొండమల్లేపల్లి, చందంపేట, నేరేడుగొమ్ము, నాంపల్లి మండలాల్లో వర్షం కురిసింది. వర్షం కురవడంతో దేవరకొండతో పాటు పలు మండలాలు, గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అకాల వర్షాలు కురుస్తుండటంతో ఇప్పటికే పత్తి పంట చేతికి వచ్చి ఎరడానికి సిద్ధంగా ఉండటంతో రైతులు వర్షానికి పత్తి తడుస్తుందని ఆం దోళన వ్యక్తం చేస్తున్నారు. దేవరకొండ డివిజన్‌లో 1 లక్ష 40 వేల ఎకరాల వరకు పత్తి పంటను సాగు చేశారు. పత్తి పంట చేతికి వచ్చే సమయంలోనే వర్షాలు కురుస్తుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీసీఐ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయకపోవడంతో చేతికి వచ్చిన పత్తిని రైతులు విధిలేని పరిస్థితిలో వ్యాపారులు చెప్పిన రేటుకే విక్రయించే పరిస్థితి ఏర్పడింది.


కొండమల్లేపల్లిలో కురుస్తున్న వర్షం

కొండమల్లేపల్లిలో భారీ వర్షం

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి పట్టణంలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో ప్రధాన రహదారి జలమయం కాగా వర్షంతో పట్టణవాసులు కొంత మేర ఇబ్బంది పడ్డారు. సుమారు 2 గంటల పాటు వర్షం కురిసింది.

చింతపల్లి: రెండు రోజులుగా ముసురుతో కూడిన వర్షం కురుస్తుండటంతో చింతపల్లి మండలంలోని పలు గ్రామాల్లో పత్తి పొలంలోకి వర్షపు నీరు చేరింది. దీంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఆరు గాలం కష్టపడి పండించిన పత్తి పంట చేతికి వచ్చే సమయానికి వర్షం కురుస్తుండటంతో జలమయం కావడంతో రైతులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. గొడకొండ్ల, పోలేపల్లిరాంనగర్, తక్కళ్లపల్లి, ఉమ్మాపురం, చాకిలిశేరుపల్లి, ఎం.మల్లేపల్లి, వీకేమల్లేపల్లి, సాయిరెడ్డి గూడెం, వింజమూర్, తీదేడు, నసర్లపల్లి, తదితర గ్రామాల్లో రైతులు అధిక శాతం పత్తి పంటను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రైతులందరూ రూ.లక్షలు ఖర్చు చేసి పంటలను సాగు చేస్తుంటే తుఫాన్ ప్రభావం వల్ల కురుస్తున్న వర్షాలకు పత్తి రైతులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి కలిగింది. సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారులు రెచ్చిపోయి అధిక ధరలకు పత్తిని కొనుగోలు చేస్తున్నారని రైతులు మండిపడ్డారు.


చింతపల్లి: గొడకొండ్లలో పత్తి పొలంలోకి చేరిన వర్షపు నీరు

పగిలిన మిషన్‌భగీరథ పైపులు

దేవరకొండ, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): దేవరకొండ డివిజన్‌లోని డిండి మండలం కందుకూరు వాగులో వరద ఉధృతితో మిషన్ భగీరథ పైప్ లైన్లు పగిలిపోయాయి. దీంతో కొద్ది రోజులుగా డివిజన్ పరిధిలోని చందంపేట, డిండి మండలాలలోని 80 గ్రామాలకుపైగా మిషన్ భగీరథ కృష్ణా నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది. ఇటీవల కురిసిన వర్షాలకు కందుకూరు వాగు ఉధృతి అధికం కావడంతో డిండి, చందంపేట మండలాలకు సరఫరా అయ్యే కృష్ణా జలాల పైప్‌లైన్లు పగిలిపోయాయి. మిషన్‌భగీరథ అధికారులు మరమ్మతులు చేపడుతున్నా పూర్తి కాలేదు. దీంతో చందంపేట, డిండి మండలాల్లో భగీరథ నీటి సరఫరా నిలిచిపోయిన గ్రామాలకు ప్రత్యామ్నాయంగా స్కీం బోర్లు, ట్యాంకర్ల ద్వారా ఎలాంటి ఇబ్బందులుపడకుండా నీటి సరఫరా చేస్తున్నట్లు భగీరథ అధికారులు పేర్కొంటున్నారు. పండుగల పూట భగీరథ నీటి పైప్‌లైన్లు పగిలిపోవడం, నీటి సరఫరాకు అంతరాయం కలుగడానికి భగీరథ అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. 15 రోజులుగా కృష్ణా జలాలు నిలిచిపోయినప్పటికి అధికారులు పట్టించుకోవడంలేదని వెంటనే మరమ్మతులు చేసి సరిఫడా కృష్ణా జలాలు సరఫరా చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వెంటనే మరమ్మతులు చేపట్టాలి



మిషన్‌భగీరథ అధికారులు నిర్లక్ష్యం చేయకుండా మరమ్మతులు చేసి కృష్ణా నీరు సరఫరా చేయాలి. నీరు సరఫరా కాకపోవడంతో వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితి. వెంటనే స్పందించి మరమ్మతులు చేసి సమస్యను పరిష్కరించాలి.

– మైనుద్దీన్, కందుకూరు, డిండి



మరమ్మతులు చేసి నీటిని సరఫరా చేస్తాం

కందుకూరు వాగులో పైప్‌లైన్లు పగిలిపోవడంతో డిండి, చందంపేట మండలాలలో 80 గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ప్రత్యామ్నాయంగా స్కీం బోర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నాం. బోర్లులేని గ్రామాల్లో గ్రామపంచాయతీ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నాం. రెండు రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుంది.

– నగేష్, డీఈ, మిషన్‌భగీరథ


డిండిలో మంచినీటిని సరఫరా చేసే మిషన్‌భగీరథ వాటర్ ట్యాంకు

ఆరు సంవత్సరాల్లో ఆరుగురు

● అసువులు బాసిన కౌన్సిలర్లు ● విషాదంలో తాజా మాజీ కౌన్సిలర్లు


తాజా మాజీ కౌన్సిలర్ రామకృష్ణ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, చిత్రంలో తాజా మాజీ కౌన్సిలర్లు

(ఆంధ్రజ్యోతి - మిర్యాలగూడ టౌన్)

పట్టణంలో 48 వార్డులు ఉన్నా చాలా చిన్నది. పార్టీలు వేరైనా పదవులన్నీ ఒక్కటే నంటూ కౌన్సిలర్లందరూ కలిసి మెలసి ఉండేవారు. కౌన్సిల్ సమావేశాల్లో కాసేపు కారాలు మీరాలు నూరుకున్నా... సభ ముగిసేలోపు జోకులు వేసుకుని నవ్వుకునేవారు.. సరదాగా ఉండేవారు. మళ్లీ ఇదే సమావేశం మందిరంలో అందరం కౌన్సిలర్లుగా కలవాలని కలలుకనేవారు. అయితే దురదృష్టం వెంటాడిందో, మరేమైందో తెలియదు కానీ.. ఒక్కొక్కరుగా మరణిస్తూ మిత్రులకు ఆవేదన మిగులుస్తున్నారు.

విషాదంలో తాజా మాజీలు

పట్టణంలోని 14వ వార్డు మాజీ కౌన్సిలర్ గంధం రామకృష్ణ మరణంతో తాజా మాజీలందరూ విషాదంలో మునిగిపోయారు. కౌన్సిల్ పదవీకాలం ముగిసి 8 నెలల పూర్తికాగా పాలక సంఘం మాజీలందరూ సభలు, సమావేశాలు, జాతీయ పండుగలు, ఉత్సవాల్లో కలుస్తూ పలకరించుకుంటుంటారు. అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ పర్యాయం అంటే పురపాలికకు జరిగిన ఎన్నిక-ఎన్నికకు మధ్య కాలంలో.. కౌన్సిలర్లుగా గెలిచిన వారిలో ఆరుగురు మృత్యువాత పడ్డారు. వారి మరణాలకు వేర్వేరు కారణాలైనా కలిసికట్టుగా ఉన్న వారిలో మిత్రులను కోల్పోవడం జీర్ణించుకోలేకపోతున్నారు. 9వ వార్డు కౌన్సిలర్ ఐల మల్లమ్మ, 14వ వార్డు తాజా మాజీ గంధం రామకృష్ణ, 21వ వార్డు కౌన్సిలర్ కుర్ర విష్ణు (మునిసిపల్ వైస్‌చైర్మన్), 24వ వార్డు కౌన్సిలర్ కుందూరు నాగలక్ష్మి, 33వ వార్డు కౌన్సిలర్ బంటు రాంచంద్రు, 38వ వార్డు కౌన్సిలర్ కోడిరెక్క విజయ్‌కుమార్ మృతి చెందడంతో విషణ్ణవదనంతో కనిపించారు.

సినిమా గైడ్ : మిర్యాలగూడ: శ్రీనివాస : ఓజీ, వెంకటేశ్వర: మిరాయ్, రాఘవ: ఓజీ, విట్రోస్: ఓజీ, కిష్కింధపురి, మిరాయ్, దక్ష, భద్రకాళి, దేవరకొండ : మనోజ్ : ఓజీ, మైత్రి వెంకటేశ్వర : కాంతార -1